శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబాజీ కీ జై!





# గురుకృప

విజయదశమి సంచిక

**శతవసంతాల సమాధానోత్సవము**



# -: ఋణానుబంధం :-

బాబా ఏమి చెప్పారు? నా భక్తుడిని నేనే ఎన్నుకుంటాను.
నా సంకల్పం లేకుండా నా ఇష్టం లేకుండా
ఎవ్వరూ కూడాను శిరిడీకి రారు.
నా భక్తుడు కాలేరు అని చెప్పారు.

ఎట్లా ఎన్నుకుంటారు?
ఏ basis మీద ఎన్నుకుంటారు?
ఏ అర్హతలు చూసి ఎన్నుకుంటారు?
ఇన్ని కోటానుకోట్ల జీవుల్లో వీళ్ళే నా భక్తులు అని
ఎన్నుకోవడానికి ఆయనకు ప్రాతిపదిక ఏమిటి?



మనలో ఉండే అర్హతలా? మన సాధనా పటిమా?
మన పూర్వజన్మ సుకృతమా? మనకంటే ఇంకా బాగా
సాధన చేసేవారు దొరకరనా? ఎందుకు?
మనల్నే ఎందుకు ఎన్నుకోవాలసలాయన?
దీనికి బాబానే చెప్పారు సమాధానం.
నాకూ, వాళ్ళకీ ఉండేటువంటి ఋణానుబంధం,
పూర్వజన్మ సంబంధం.

ఈ పూర్వజన్మ సంబంధం వల్ల మనమందరం ఒక దగ్గర
కలుస్తాం. వాళ్ళే నా దగ్గరకు వస్తారు.
వాళ్ళనే నేను ఎన్నుకుంటాను.

అల్లా నాకు కొంతమంది జీవులను కేటాయించారు.
వీళ్ళ యొక్క బాగోగులు నేను చూసుకోవాలి అని చెప్పారు.
ఎందుకు ఎట్లా కేటాయించారు? (మిగతా 31వ పేజీలో)

**చూపు తాకినచోట చొక్కముగ నీవే - శ్రీబాబూజీ**

నిత్య ప్రార్థన, పూజ దినచర్యను దివ్యంగా నడుపుకునేందుకు కావలసిన నేపథ్యాన్ని రూపొందించుకునేందుకే.
ఆ పైన దినచర్య అంత ఒక అఖండమైన దైవదర్శనంగా కొనసాగుతూ ఉంటుంది.

సంపుటి : 20
సంచిక : 4

సెప్టెంబర్ 30
2017






# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

**పథగామి** - గురుకృప 4
**అభ్యుదయపథం...** - గురుకృప 7
**ఉథాండిలో .......** - ఉమా మహేశ్వరరావు 7
**వితరణలో విపరీతాలు** - శ్రీ నీలంరాజు లక్ష్మీప్రసాద్ 9
**సంస్కృతి** - సన్నిధి 12
**నీటిబొట్టు** - గురుకృప 13
**మ్రొక్కిన వరమీని...** -శ్రీబాబూజీ 16
**గురుకృపాలహరి** - గురుకృప 21



నిర్వహణ : ***గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు***

**GURUKRUPA**

Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

"నా మట్టి మాట్లాడుతుంది, నా సమాధి సమాధానమిస్తుంది" – శత వసంతాల 'సమాధాన స్థితి'. ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో సద్గురు సామ్రాట్టు శ్రీసాయిబాబా ఆనందస్వరూపులై లిఖించారు, భక్తుల మనోఫలకంపై అనుగ్రహాశీస్సుల 'శృతి'. ఏ ఒక్క మతానికి చెందని 'తత్త్వం' – మనిషి దైవంగా పెరగడమే 'మతం'గా సంచరించిన దైవత్వం. మతం పేరున సంకుచితమై, సాంప్రదాయం పేరున లుప్తమై, మానవత్వపు మనుగడే మట్టిలో కలిసిపోతున్న సమయంలో 'శీలధి'లో ఈ జగత్తుకు ఆనంద 'జలధి'గా దర్శనమిచ్చారు శ్రీసాయిబాబా. ఏనాడూ ఆధ్యాత్మిక ప్రవచనాలు చేయలేదు – దీక్షలు ఇవ్వలేదు, మంత్రాల మాయలు చేయలేదు, మతాలు మార్చలేదు, ధనం కూర్చలేదు. భిక్ష స్వీకరణ – 'మాయి'లా బిడ్డల సంరక్షణ. మానవరూపంలో వారు సంచరించింది కేవలం కొన్ని దశాబ్దాలు. భక్తుల మనో మందిరాల్లో నివసిస్తోంది శతాబ్దకాలం పైగా. వందలు, వేలుగా వారి చెంత చేరిన సాయిబిడ్డలు బంధువులై, గురుబంధువులై, ప్రేమ సింధువులై కోటానుకోట్లుగా వారి చరణాల చెంత సేద తీరుతున్నారు. ప్రజలు చీమలబారుల్లా శిరిడీ చేరతారన్న సాయిమాట అక్షరసత్యమై సాక్షాత్కరిస్తోంది. "నా భక్తులు అడిగినవన్నీ ఇస్తాను – నేనివ్వదలచింది వారడిగేంత వరకు" అన్న శ్రీసాయి మాటను బాటగా చేసుకొని ఇహపరశ్రేయోదాకమైన సాయిపథాన్ని, సాయిపదాల్ని ఆశ్రయించుకొని ఆ ఆనందస్వరూపుని ఒడిలో అందంగా జీవనయానం సాగిస్తున్నారు సాయిపథగాములు. ఆధ్యాత్మికత పేరున, మతం పేరున జరుగుతున్న మౌఢ్యాన్ని నిరసించిన శ్రీసాయి – తంతుల పేరుతో అంతమైపోతున్న భక్తిమార్గాన్ని పరిప్లావతం చేశారు. 'మా సాంప్రదాయమే వేరు' అంటూ సనా(నూ)తన మార్గానికి శ్రీకారం చుట్టారు. చరాచర జగత్తులోని ప్రతీ జీవిలోనూ తానే ఉన్నానని నిదర్శనాపూర్వకంగా తెలియచేస్తూ శరణాగతి మార్గానికి 'సాకారం'గా నిలిచారు. 'గ్లాని' కలిగింది – నింబవృక్షం క్రింద 'మౌని'గా ప్రభవించి మనిషి మనసులో చేదును (దుర్గుణాలు) తొలగించి – మాధుర్యాన్ని (మానవతా పరిమళాలను) ప్రసాదించారు.

పరిమితమైన దేహస్థితి నుండి అపరిమిత 'సమాధాన' స్థితిలో దర్శనమిచ్చిన శతవసంత ఉత్సవం ప్రతీ సాయి భక్తునికి అంబరమంత పండుగే! అడిగిన వారికి అడిగినట్లు ప్రతీ అవసరానికి శ్రీసాయిచెంత 'సమాధానం' లభిస్తూనే ఉంది. అయితే వారివ్వదలచింది ఏమిటో అన్న ప్రశ్న మనలో



ఉదయిస్తోందా? వారివ్వదలచింది ప్రతీ మనిషి అడగాలన్న ఒక మహోన్నత ఆశయం నుండి ఉద్భవించినదే 'సాయిపథం'. ఏ ఛాందసపు జాడలు, ఏ తంతుల తమాషాలు – శ్రీసాయిబాబా నిరసించారో అవే మరలా సాయిస్రవంతిలో చేరుతుండడంతో ఆ చీకట్లను తొలగించి, సాయి స్వస్వరూపాన్ని బిడ్డలు దర్శించే క్రమంలో శ్రీసాయినాథుని శరత్‌బాబూజీగా సాయి అరుణోదయమయింది. శ్రీసాయి ప్రేమే హవిస్సుగా ఒక స్వచ్ఛమైన, స్పష్టమైన, పరిపూర్ణమైన, సాయిదే అయిన సాయిపథంగా, సద్గురుపథంగా అలరారుతోంది. సాయిభానుడు లేని శరశ్చంద్రుడు లేడు అన్నట్లు పూజ్య శ్రీబాబూజీ జీవితం శోభిల్లింది. పిడకలేరుకోడానికి పరిమితమైపోతున్న ప్రతీ సాయిభక్తుడిని తట్టిలేపి, చేయిపట్టి నడిపించి, ఆ ఒక్కడుగు మనం వేయాలని తపించే స్వాప్నిక సౌరభం శ్రీబాబూజీ. "నాలో ఎంత పరిణితి వచ్చింది? నాలో ఎన్ని దుర్గుణాలు పోయాయి? నేను ఇంకా బాబాకు ఎంత దగ్గరయ్యాను? మనం ఎక్కడ ఉన్నాం? ఎందుకోసం వచ్చాం? ప్రతీరోజూ గుర్తుచేసుకోండి ఉదయం లేవగానే. మనం ఎందుకు వచ్చాం ఇక్కడికి? ఎక్కడ ఉన్నాం అసలు? ఎందుకోసం ఉన్నాము? ఏమి సాధించడానికి ఉన్నాము? సాధిస్తున్నామా? ఏమి చేయడానికి వచ్చాం"? అని ప్రతీ సాయిభక్తుడు తనను తాను తరచి తరచి చూసుకుంటూ లక్ష్యశుద్ధితో సాగి పోవాలంటారు శ్రీబాబూజీ. అట్టి లక్ష్యశుద్ధిని కలిగి ఉంటూనే ఆ లక్ష్యాన్ని సిద్ధించుకోవడం మనం సాయి సైనికులమవ్వాలని వారు చూపిన బాట. "మామూలు సైనికుడికి కత్తి, డాలు, మనకు బాబా ప్రేమ, బాబా భక్తి, పారాయణ, సత్సంగం, సాటి వారిని ప్రేమించడం – ఇవి మన ఆయుధాలు". శ్రీసాయి చూపిన మార్గంలో శ్రీబాబూజీ చెప్పక విడిచిన అంశం లేదు. నేర్చుకోవాలనే దృక్పథాన్ని అలవర్చుకుంటే ఆ మహితాత్ముని ప్రబోధం దీపస్థంభమై తప్పక దారి చూపుతుంది. శతవసంత సమాధాన ఉత్సవ 'సంరంభం' సాయిభక్తులు తమను తాము విశ్లేషించుకునేందుకు 'ఆరంభం' కావాలి. శ్రీసాయిపేరున చలామణి అవుతున్న మంత్రదీక్షలు, యంత్రాల యాతనలు, శక్తిపాతాల పాతాళాలు, ఇత్యాదులన్నీ శుభ్రమైన సాయిమార్గమేనా అన్న విశ్లేషణ ఎంతైనా ఆవశ్యకం. ఇలాంటి వైపరీత్యాలు ఎదురవుతాయనే సాయిభక్తి సాధనలోని రహస్యాలను శ్రీరామానుజులవలే జనసామాన్యానికి చేరువ చేసారు శ్రీబాబూజీ.

మనిషి మానసంలో కులాల కుళ్ళుగా, జాతకాల జాఢ్యంగా, కట్నాల కంపుగా, సాముద్రికాల మలినంగా, తంతుల తక్కెడగా, అసూయాద్వేషాల ఆనవాళ్ళుగా, ఇలా ఎన్నో, మరెన్నో,



మహిషరూపాలుగా ఉద్భవిస్తున్న ప్రతీ అంశాన్ని నిష్కర్షగా, నిర్దయగా, నిర్భయంగా సాయిప్రేమ, గురుభక్తి అనే ఆయుధాలతో వధించిననాడే మనం గురుచరణాలను చేరుకోగలం. **అపారకరుణావరుణుడైన సద్గురుచంద్రుని అనుగ్రహంతో ఈ శతవసంతాల సాయిప్రేమలో మనము భాగమయ్యాము. పిడకలేరుకుంటూ శేషప్రశ్నగా మిగిలిపోదామా? కడకు గురుచరణాలను చేరుకుంటూ సాయిశ్లేష (సంగమం)గా నిలిచిపోదామా? ప్రశ్నించుకుందాం.. సమాధానం తప్పక లభిస్తుంది...ఈ సన్నిధి తరించేందుకే... మరణించేందుకు కాదు.. -గురుకృప**

## అభ్యుదయపథం - నేర్చుకునే దృక్పథం

శ్రీసాయి యొక్క ప్రతి చర్య, ప్రతి మాట గురించి నిరంతరం చింతన చేస్తుంటే ఒక్కొక్క అద్భుత సత్యం స్ఫురిస్తుంటే పులకించడంతో మన అంతఃకరణం వేయి సూర్యుల కాంతితో వెలుగుతుంది. అలా చింతన కొనసాగిస్తుంటే క్రమంగా ప్రతిక్షణం ఆయనలోని నిత్యనూతనత్వాన్ని, అంశాలను గమనించుకోగలం. ఆ గ్రహింపులో పారవశ్యంలో లీనమైపోతాం. అదే "క్షణే క్షణే యన్నవత రమణీయరూపం".. అది సద్గురువు ప్రతి క్షణమూ క్రొత్తగా గోచరించడం. (నదీ ప్రవాహం చూస్తుంటాం. అక్కడ మనం ప్రతిక్షణమూ క్రొత్త నీటినే చూస్తున్నాం అన్న ఎరుకలో ఎంతమందిమి చూస్తున్నాం? అందుకే ప్రవాహం చూస్తుంటే ఆనందం కలిగేది). అలా మహాత్ముల మాటలు ప్రతిసారీ క్రొత్తగా వింటున్నామా? వింటున్న ప్రతీసారి క్రొత్త ఆలోచన, అర్థం స్ఫురిస్తున్నామా? అలా అంతకంతకూ ఆయనలోని విశిష్టతను, వైభవాన్ని, అందులోని క్రొత్త అంశాలను గ్రహించుకోగలం. ఆయన గూర్చిన మన అవగాహన ఈ ప్రాకృతికమైన దేహంలాగానే అనుక్షణమూ వృద్ధి చెందుతుండాలి. ఇది అభ్యుదయం అంటే. ఆయనపట్ల అవగాహనతో ప్రేమ పెరుగుతుంటుంది. ఆ ప్రేమ పెరుగుతున్న కొద్దీ వ్యక్తీకరిస్తుంటుంది. (నిండాక పొర్లుతుంది – సహజంగా, ఇక అడ్డులుండవు). మనలో అడ్డులు తొలగాలంటే ఇలా ప్రేమను పెంచుకోవాలి, నింపుకోవాలి, నిండాలి. పొంగి పొర్లాలి (పారాలి). ఇది జీవించడం అంటే.. ఆధ్యాత్మికత అంటే... అంతమేర ఆయనపట్ల శ్రద్ధ –సబూరీ వృద్ధి చెందుతాయి. ఆయనడిగిన రెండుపైసల దక్షిణ సమర్పించే స్థితికి ఎదగనిస్తుంది.

వారి 'చూపు' – అంతటా అన్నిటా ఉన్న దివ్యత్వాన్ని అలా దర్శించడం నేర్చుకొమ్మని. 'అల్లా అచ్ఛాకరేగా' అన్న వారి మాటలు – భగవంతుడు మనకు ఇచ్చేదంతా శ్రేయస్సే అన్న ఎరుకలో

‘నిశ్చింతగా’ ఉండమని. వారి ‘మౌనం’ – అట్టి నిశ్చింతలో ‘వినడం’ నేర్చుకొమ్మని (నిశ్చింత, నిర్మలత్వం, నిశ్చలతలే మనసు మౌనం ధరించేలా చేస్తాయి). వారి ‘చిరునవ్వు’ అలా నిరంతరం సద్గురుని స్మరణ, స్ఫురణలతో పరవశం పొందమని–ఇలా ఆయనలోని ప్రతి అణువూ, సర్వమూ మనకు ప్రబోధిస్తున్నాయి. అందుకే ఆయన చెప్పక విడచిన విషయం లేదు అంటున్నది గురువుగారు. మన జీవనంలో జీవితమనే పుస్తకాన్ని అర్థవంతంగా, రసవత్తరంగా చదువుకోవడానికి, ఆస్వాదించడానికి, అనుభవిస్తూ, సంస్కరించుకుంటూ, తీర్చిదిద్దుకుంటూ ఆయనవాడిగా జీవించడానికి చెప్పక విడచిన విషయం లేదు. “బాబా బోధ సమగ్రంగానే ఉంది. మన అవగాహనే పరిపూర్ణం కావలసింది” అన్నారు శ్రీబాబూజీ. ఆయన పది అడుగులు వేసేసారు, నీవు వేయవలసిన ఒక్క అడుగే మిగిలి ఉంది. మరి ఎంత దూరం మనకి, ఆయనకి అంటే – ఒక్క ‘అడుగు’ దూరం. ఈ ఒక్క అడుగుతో మనలో ఎన్ని అడ్డులు – ఆయన దరి చేరేందుకు. ఈ అడ్డుల్ని తొలగించుకునే సులువుల్ని, నేర్పుని మనకందిస్తాయి – సత్సంగం, దర్శనం, పారాయణ, మననం, స్మరణాదులు. ఆయనివ్వదలచినది మనం అడిగేందుకు, ఆయన ప్రతిరూపంగా మారేందుకు ఈ దర్శన, సత్సంగ, పారాయణ, స్మరణ, సాగి తీరవలసిందే. ఇలా సద్గురుని ప్రతీ కదలికా, ప్రతీ చర్య, ప్రతీ స్పందన, ప్రతీ మాట – ఇలా ప్రతీదీ మనకు ప్రబోధిస్తున్నాయి. వాటిని గ్రహించుకునేందుకు (మనల్ని నిగ్రహించుకునేందుకు) అనుగుణంగా వర్తించేందుకు మనకు కావలసింది– నేర్చుకోవాలనే దృక్పథం.



## ఉథాండిలో గురువుగారి దర్శనాలు

2004వ సంవత్సరంలో ఆదివారం సాయంత్రం టి.నగర్‌లో సత్సంగం అయిపోయాక గురుబంధువులంతా కలసి వ్యాన్‌లో దర్శనం కోసం గురువుగారి దగ్గరకు వెళ్ళేవాళ్లం. అప్పుడు గురువుగారు ఉథాండి దగ్గర ఉండేవారు. గురువుగారి దర్శనానికి వెళుతున్నామనే తలపే ఆనందాన్ని ఇచ్చేది. చెన్నైలోని ఉక్కపోత వాతావరణం నుండి దూరంగా సాగిపోతూ ECR వెంబడి వీచే చల్లని సముద్రపు గాలికి సేదతీరుతూ కొద్దిసేపటిలో గురువుగారిని చూస్తామనే ఆనందంతో మనస్సు పరవశించేది. ఈ రమణీయమైన ప్రయాణానికి గమ్యం గురువుగారి దర్శనం. ప్రయాణం సాగుతున్నంతసేపూ ఉత్సాహం ఉరకలేస్తూ ఉండేది. ఉథాండి చేరిన తరువాత గురువుగారి దర్శనం దాదాపు 8 గంటల ప్రాంతంలో ఉంటుంది. గురువుగారి దర్శనం కోసం వెయిట్ చేయడంలో


‘నాకు బాబా ఉన్నారు’ అనే ఖచ్చితమైన నమ్మకం నిన్ను ఆనందంగా ఉంచాలి. -శ్రీబాబూజీ



ఉండే ఆ ఆనందం మరెందులోనూ ఉండదనేది అక్షరసత్యం.

ఎనిమిది గంటల సమయంలో గురువుగారి అనుమతి లభించాక ఒకరితో ఒకరు పోటీపడుతూ స్కూల్ పిల్లల్లాగా టెర్రస్ మీదకు పరిగెత్తేవాళ్ళం. గురువుగారి కుర్చీకి దగ్గరగా కూర్చోవాలనే ఆతృత అందరితో పరుగులు పెట్టించేది. అప్పటివరకు గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్నవాళ్ళం ఒక చిటికెలో సెకెండ్‌ఫ్లోర్‌లోని ఓపెన్ టెర్రస్ మీదకు చేరేవాళ్ళం. ఒక్కొక్కసారి గురువుగారు ముందుగానే అక్కడ కూర్చుని ఉండేవారు. ఒక్కోసారి మేము వెళ్ళిన తరువాత వచ్చేవారు. వారు వస్తున్నప్పుడు గంభీరమైన ఆయన నడకలో నిజం, నిజాయితీ, స్థైర్యం కలగలిసిన రాజసమేదో కనిపించేది. ఆ ఎక్సైట్‌మెంట్ గురించి వర్ణించాలంటే మాటలు సరిపోవు. ఆ చల్లని సమయంలో డిమ్ లైటింగ్ మధ్య పూర్ణచంద్రునిలా మెరిసే వారి రూపం మనోహరంగా ఉండేది. వారు వచ్చి ఆసీనులైన తరువాత అందరినీ ఒక్కసారి పలకరింపుగా చూసేవారు. ఆ క్షణంలో మనం ఎవరం, ఎందుకోసం వచ్చాం, ఎక్కడున్నాం, చుట్టూ ఎవరున్నారు అన్న స్ఫురణే ఉండేది కాదు. వారి సమ్మోహకరమైన చూపు, చిరుమందహాసం తప్ప మరేమీ కనిపించేది కాదు. ఆ దృశ్యం నా మనోఫలకంపై శాశ్వతంగా ముద్రించుకుపోయింది. వారి సన్నిధిలో మౌనం అంతరాళాలలో ఉన్న అన్నీ కన్ఫ్యూజన్‌లను చీల్చుకుపోతుంది. మనస్సు ఒక క్లారిటీతో నిండిపోతుంది. ఆ క్లారిటీకి ప్రతిరూపంగా కళ్ళ ముందున్న గురువుగారు, ఇలా లోపలా బయటా అంతా వారే అయిన ఆ క్షణాలు ఆర్ణవమైన ఆనందానికి ప్రత్యక్ష సాక్ష్యాలు.

ఒకసారి సముద్రపు ఒడ్డున గురువుగారిని దర్శించుకునే అవకాశం వచ్చింది. అది పౌర్ణమిరోజు. గురువుగారు అలా చైర్‌లో కూర్చుని ఉండగా మేమంతా చాపలు పరచుకొని క్రింద కూర్చున్నాము. సముద్రం ఒడ్డున అలలు తాకేటంత దూరంలో ఉన్నాం. ఆకాశంలో నిండు చంద్రుడు, వెన్నెలను ప్రతిబింబించే అలలు, అద్వితీయమైన తేజస్సుతో ఎదురుగా చైర్‌లో గురువుగారు. అదో అద్వితీయమైన దృశ్యం. ఆ అపూర్వ క్షణాలలో మా ఆనందాన్ని వర్ణించడం వీలు కాదు. గురువుగారు వెళ్ళిపోయిన తరువాత కూడా ఎక్సైట్‌మెంట్ నుండి బయటపడలేక అక్కడే ఆ రాత్రంతా ఉండిపోవాలనిపించింది. ఆ సాహసానికి కూడా పూనుకున్నాం. కానీ పోలీసులు రావడంతో మాకు కదలక తప్పలేదు.

గురువుగారి దర్శనం అయిన తరువాత అయిష్టంగానే తిరిగి బయలుదేరేవాళ్ళం. హాలిడేస్ అయిపోయి స్కూల్‌కి వెళుతున్న పిల్లల్లాగా ఉండేది మా పరిస్థితి. ఇళ్ళు చేరింది మొదలు మళ్ళీ



ఆదివారం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసేవాళ్ళం. గురువుగారికి నచ్చినట్లు ఉంటే గురువుగారు చూస్తారనే ఆశ ఉండేది. అందుకే రాబోయే ఆదివారం వరకు ఏదో ఒక నియమాన్ని పెట్టుకుని వారికి నచ్చిన విధంగా ఉండటానికి ప్రయత్నించేవాళ్ళం. అలా ప్రయత్నం చేసి వెళ్ళాక, వారు పలకరింపుగా చూసే చూపు మాలో మరింత ఉత్సాహాన్ని నింపేది. ఎప్పటికీ వారికిష్టమైన వారిగా ఉండాలనిపించేది. ఇలా కొన్ని నెలలపాటు మాకు ఉథాండిలో గురువుగారి దర్శనభాగ్యం లభించింది. **– ఉమా మహేశ్వరరావు, చెన్నై సత్సంగ్ న్యూస్‌లెటర్ నుండి**

## వితరణలో విపరీతాలు

నేటి రాజకీయ నాయకులు వెనుకటి నాయకుల కన్నా తెలివైనవారు. స్వాతంత్ర్యం సిద్ధించక పూర్వం రాజకీయాల్లోకి అడుగిడిన ఆనాటి దేశభక్తులు కొందరు తమ స్వంత ఆస్తుల్ని, సంపాదనలను రాజకీయోద్యమాల్లో వెచ్చించారు. కొందరు తమ స్వంత భవనాలను కాంగ్రెస్ పార్టీకి ఇచ్చేసారు. వాటిని దేశానికి అంకితం చేసారు. పదవులు చేపట్టినప్పుడైనా, బంధుప్రీతి, మైత్రి వంటి మానవ సహజమైన చిన్న చిన్న బలహీనతలకు లొంగి ఏవైనా తప్పులు చేసారేమోగానీ, అక్రమార్జనకు పాల్పడలేదు.

తరం మారుతున్న కొద్దీ నీతి కూడా మారిపోతున్నది. నేడు ఏమీ లేనివారు, రాజకీయాల్లో ప్రవేశించిన పదేళ్ళలోగా, ఐదుతరాలకు సరిపడేంత సంపాదించి పడేస్తున్నారు. రాజకీయాల్లోకి రాకమునుపే సంపాదించింది చాలా ఉంటే అదంతా తమ సంతానానికి పంచేసి, ఐ.పి. దాఖలు చేసిన వారి తీరుగా, "నావద్ద ఏముంది? మృత్తిక. ఇక నా సేవలందుకోండి, నా దేహమే ఈ దేశానికంకితం" అని ప్రకటిస్తున్నారు. ఐతే తమాషా ఏమిటంటే, ప్రజలీమాటలు నమ్మకపోయినా, ఈ చేష్టలన్నీ నవ్వు గొల్పిస్తున్నా, వారికి ఇదీ ఒక వినోదంగానే ఉంటున్నది. ఇలాంటి అద్భుతమైన వినోదాన్ని అందిస్తున్న వ్యక్తికి నవ్వుతూ నవ్వుతూనే ఓటు వేసి వస్తున్నారు.

కానీ ఒకప్పుడీ భారతదేశాన్ని ఏలిన వారిలో అత్యుత్తమ దానశీలురు, త్యాగధనులు ఉండేవారు. పురాణాల్లోనైతే బలి చక్రవర్తి, తనని పరీక్షిస్తున్నది ఆ శ్రీమహావిష్ణువేనని తెలిసినప్పటికీ, వాగ్దాన భంగమొల్లనని, తలపై పాదం మోపుకుంటూ పాతాళానికి వెళ్లాడు. భారతంలోని కర్ణుడు, ప్రచ్ఛన్న


**బాబా ఇచ్చిన దానిని ఆనందంతో అనుభవించండి, ఆస్వాదించండి. -శ్రీబాబూజీ**



వేషంలో వచ్చిన ఇంద్రుడికి తన కవచకుండలాలనే దానం చేసి ప్రాణానికే ముప్పు తెచ్చుకున్నాడు. రఘువంశీయులు దానాలు చేయడానికే ధనమార్జించేవారని కాళిదాసు వారిని ఆకాశానికెత్తేసాడు. కానీ ఇవన్నీ పురాణగాధలే, పూర్తి నిజం ఎవరికీ తెలియదు.

మరి ఇలాంటివారు చరిత్రలో కనిపిస్తారా అని వెతికితే, హర్షవర్ధనుడు ఇలాంటి రాజేనని చరిత్రకారులంటారు. ఈ చక్రవర్తి అయిదేళ్ళ కొకసారి ప్రయాగనగరంలో "మహామోక్ష పరిషత్" అనే పెద్ద సమావేశం జరిపించేవారు. ఆ సమయంలో అక్కడ గుమిగూడిన ఎక్కడెక్కడివారికి దానధర్మాలు నెఱిపేవారు. తాను అంతకుమునుపు అయిదేళ్ళలో ఆర్జించినదంతా దానం చేసేసేవారు. దేశరక్షణకు ఉద్దేశించిన ఆయుధసామగ్రి మాత్రమే ఉంచుకునేవారు.

ఈ వితరణ మహోత్సవం రోజుల తరబడి సాగేదట. చరిత్రకారులు తెలియజేసేదానిని బట్టి ప్రయాగ వద్ద గంగా యమునానదుల సంగమతీరానికి, దేశం నలుమూలల నుండి సుమారు ఐదు లక్షల మంది వచ్చేవారట. హర్షవర్ధనుడు కులవర్ణ విబేధం పాటించకుండా దానధర్మాలు చేసేవాడట. ఖజానాలోవున్నది, తనకున్నదీ మొత్తం ఖాళీ అయిపోయేంతవరకు దానం చేస్తూనే ఉండేవాడట.

ఒక సందర్భంలో భిక్షువు ఒకడొచ్చి ప్రార్థించే వేళకు హర్షుడి వద్ద ఏమీ లేదు. తన వొంటిపై కప్పుకున్న ఉత్తరీయాన్ని అతడికి ఇచ్చేసి, సోదరి రాజ్యశ్రీ వద్ద ఆవిడ కప్పుకున్న పై బట్టను తీసుకొని తన దేహం మీద ధరించాడట!

ఇలా ముందూ వెనుక చూడకుండా ఉన్నదంతా ఇచ్చేయడంలో ఇబ్బందులు లేకపోలేదు. తనని తానే కాక, ఇతరులను కూడా ఇబ్బంది పెట్టినట్లవుతుంది. కానీ తరచూ హృదయావేశంతో వివశడయ్యే శ్రీరామకృష్ణపరమహంస వంటి పుణ్యపురుషులకు లౌకిక ఇబ్బందులు గుర్తు రాకపోవడం కూడా సహజమే. నిరంతర భగవద్ధ్యానంలో మునిగితేలే శ్రీరామకృష్ణుల వారికి కాస్త వినోదం చేకూర్చాలనే

**"ఎవరైనా నా దగ్గరకు ఋణానుబంధం వల్లనే వస్తారు" అన్నారు బాబా. మనందరికీ మధ్య గల ఋణానుబంధాన్ననుసరించి నేను మిమ్మల్ని బాబా నాకిచ్చిన ప్రసాదంగా భావిస్తాను. అంతేకానీ మరేదీ కాదు. మీరు పవిత్రంగా చూస్తారో లేదో - అది వేరే విషయంగానీ - నాకు మాత్రం మీరంతా బాబా ఇచ్చిన పవిత్రమైన ప్రసాదం. నేను మిమ్మల్ని బాబా ప్రసాదంగా భావించి స్వీకరిస్తాను. బాబా అందరికీ హితమే చేకూర్చుతారు. బాబా మీకు మంచి చేస్తారు. అప్పుడు మీరు మీతో పాటు నేను సంతోషిస్తాను. -శ్రీబాబూజీ**

ఉద్దేశంలో భాగ్యవంతుడైన ఆయన అనుచరుడు మధురబాబు, పురాణకథలపై ఆధారపడిన జానపదుల నాటక ప్రదర్శనలకు తీసుకు వెళ్తుండేవాడు. నేలమీద పరచిన జంపకాణంపై కూర్చునిఅందరూ ప్రదర్శనను తిలకించేవారు. ఎవరి నటనైనా శ్రీరామకృష్ణులకు బాగా నచ్చినపుడు, బహుమతిగా వారికేదైనా ఇవ్వడానికి శ్రీరామకృష్ణులకు నిజంగానే వర్తిస్తుంది. అందుకని మధురబాబు తనంతట తానే పదిరూపాయల నోట్లు పదింటిని బొత్తిగా పేర్చి శ్రీరామకృష్ణుల ముందుంచేవాడు. సుమారు శతాబ్ధం క్రింది కాలం నాటి నూరు రూపాయల విలువ నేడు ఎంత ఉంటుందో పాఠకులు సులభంగానే ఊహించుకోగలరు.



నచ్చిన నటుడికి ఓ "పదినోటు" ఇవ్వమని మధుర్ ఉద్దేశం. కానీ ఆనంద పారవశ్యంలో శ్రీరామకృష్ణులు ఈ ఏర్పాటంతా మరచిపోయి, ఎదురుగా ఉన్న మొత్తం నోట్లకట్ట వాడి చేతిలో పెట్టేసేవారు. మరొక నటుడు నచ్చితే శ్రీరామకృష్ణులు శూన్యహస్తాలతో సత్కరించవలసి వస్తుందేమోననే భయం కొద్దీ, మధుర్‌బాబు మరొక బొత్తి ఆయన ముందుంచేవారు. కానీ శ్రీరామకృష్ణులు తన ఆవేశంలో మళ్ళీ అదేపని చేసేవారు. మధుర్ వద్దనైనా అక్షయపాత్ర లేదుగదా, మరేమీ చేయలేక చూచి ఊరుకునేవాడు. ఒకసారి ఇలాగే ఎదురుగా ఉన్న డబ్బంతా ఇచ్చేసిన తర్వాత ఒక ప్రదర్శకుడు శ్రీరామకృష్ణుల మనస్సును చాలా రంజిల్ల చేసాడు. ఇవ్వడానికి శ్రీరామకృష్ణులకు ఏమీ కనిపించలేదు. అందువల్ల తన మొలమీది ఒక్క బట్టా తీసేసి అతడికిచ్చేసారు. ఇది చూచిన శ్రీరామకృష్ణుల అనుచరులు దిగ్భ్రాంతి చెందారు. తమ ఉత్తరీయమొకటి వేగంగా వారి దిగంబర దేహానికి చుట్టి వారితోటే తీసుకువెళ్ళారు. అలా మురిపించి, మురిపించి పొందినదే అనుగ్రహం. గురువుని ఆశ్రయించి, వారు చెప్పినట్లుగా చేయాలి. నీకు ఏమీ తెలియకపోతే నేను చేసి పెడతాను అంటాడు గురువు.

– శ్రీ నీలంరాజు లక్ష్మీప్రసాద్

**నిజంగా మనకు దైవదర్శనం లభించింది అనడానికి సంకేతం ఏమిటంటే ఆ స్థితిలో దైవం కానిదంటూ ఇంకేమీ కనపడదు. తనయందు, అన్నిటా, అంతటియందు వ్యక్తం అవుతున్నది ఆ దైవమే అని స్పష్టంగా తెలుస్తుంది. మన యొక్క వ్యక్తిత్వం కరిగిపోయి అస్తిత్వం మాత్రం ఉంటుంది. అలా కరిగిన వ్యక్తిత్వం - మానవత్వమై - దివ్యత్వమై వెలుగుతుంది.**



# సంస్కృతి

ఉద్యోగ నిమిత్తముగా విశాఖపట్నం క్యాంపుకు వచ్చారు శ్రీ వేదవ్యాస. గవర్నర్ బంగళాలో బస చేసారు. ఆఫీసు పనులు ముగించుకొని తేదీ 10-2-1970 నాడు ఉదయం తమ అన్నగారు శ్రీ కృష్ణమాచార్యులుగారిని చూడటానికి పెదవాల్తేరులో నున్న వారి ఇంటికి వెళ్ళారు శ్రీ వేదవ్యాస. మాస్టరు ఇ.కె. గారు ఒక యువకునికి డిక్టేషన్ ఇస్తున్నారప్పుడు. కుశల ప్రశ్నలు, కాఫీలు అయ్యేసరికి ఒక గచ్చకాయ రంగు అంబాసిడర్ కారు వారింటిముందు ఆగింది. ఒక పొడుగాటి గంభీరమైన వ్యక్తి దిగి పెద్ద కంఠస్వరంతో పలకరిస్తూ... "కృష్ణమాచార్య బాబూ! ఎందుకో ఈ రోజు మీ వద్దకు రావాలని తోచింది! అంతే! వెంటనే బయలుదేరేశాము. మీకేదైనా ఇబ్బంది కలిగిస్తున్నామా?" అంటున్న ఆ వ్యక్తిని చూస్తూనే హడావుడిగా ముందుకు వెళ్ళి వినయంగా పాదాలంటి నమస్కరించారు మాస్టరుగారు. ఆయన రెండు చేతులు తలపై పెట్టి "రామ జయం! లేవండి" అంటూ లోపలికి నడిచారు. చూట్టానికి రాజకీయ నాయకుడో, ధనవంతుడైన వ్యక్తి ఫక్కీలోనో కనిపించినా అన్నగారు నమస్కరించారు గనుక వీరెవరో యోగులో, మహాపురుషులో అయి ఉంటారని తలచి, వారి ముందుకు వెళ్ళి సవినయంగా నమస్కరించారు శ్రీ వేదవ్యాస. "మా తమ్ముడు వేదవ్యాస! ఒక ఐఎఎస్ ఆఫీసరు! అనుకోకుండా వీడికి తమ దర్శనం లభించడం అదృష్టం!" అని వేదవ్యాసగారిని వచ్చినవారికి పరిచయం చేసారు మాస్టరు ఇ.కె.గారు. అలా వచ్చిన మహనీయులు శ్రీ బాబుగారే!

ఉదయం 10 గంటల సమయం. వచ్చినవారికి భోజనం సిద్ధం చేసారు మాస్టరుగారి శ్రీమతి అప్పమ్మగారు. భోజనానికి అందరూ కూర్చున్నారు. బాబుగారు మొదటి ముద్ద ఎత్తుకొని నుదుటి వరకు తెచ్చి కళ్ళు మూసుకొని క్షణం ప్రార్థించేలోగా "భిక్ష! నాకు ముందుగా భిక్షనివ్వండి" అంటూ శ్రీ వేదవ్యాస చేయిచాపారు. మాస్టరుగారు ఆశ్చర్యపోయారు. శ్రీ గురువుగారు భగవదర్పితంగా దానిని ఎంతో ప్రేమతో ముద్ద చేసి శ్రీ వేదవ్యాస చేతిలో భిక్షగా ఇచ్చారు. భోజనాలయ్యాక కారెక్కుతూ శ్రీ గురువుగారు వేదవ్యాసతో... "బాబూ! మీరు తప్పక మన 'భీమసింగి' ఆశ్రమానికి దయచేయాలి. మీకు అక్కడ చాలా బాగుంటుంది. మండువేసవిలో ఏప్రిల్, మే నెలలలో గనుక వచ్చారంటే మీకది ఊటీలా ఉంటుంది. మీరు తప్పక ఆశ్రమానికి వెళ్ళి రెండు మూడు రోజులు గడపాలి.

–'సన్నిధి' నుండి



## నీటిబొట్టు

మనిషి జీవితం నీటిబొట్టువలే సాగాలి. ఒక్కో నీటిబొట్టు ఒక్కోలాగా పనిచేస్తుంది, ఒక్కోలాగ ఉపయోగపడుతుంది. మానవజీవితము కూడా నలుగురికి ఉపయోగపడే విధంగా ఆదర్శప్రాయంగా సాగిపోవాలి. ఒక నీటిబొట్టు దోసెలు పోసే ఒక వేడి వేడి పెనం మీద పడిందనుకోండి. ఆ వేడికి అది వెంటనే ఆవిరైపోతుంది. దాని బ్రతుకు లిప్తపాటు మాత్రమే ఉంటుంది. ఈ నీరు పెనం మీదున్న అతి వేడిని తగ్గించి, మలినమును తొలగిస్తుంది. దాని లక్ష్యము అంతటితో ముగిసిపోయింది. మానవులలో కొంతమంది సమకాలీన పరిస్థితులలో ఉండే అనాచారములను, దుర్భావనలను రూపుమాపి వాతావరణమును క్రొత్తగా నిర్మిస్తారు. ఉదా॥ వీరేశలింగం పంతులు, మదన మోహన మాలవ్యా, వీరంతా ఆనాటి దేశకాల పరిస్థితులలో పరంపరగా వస్తున్న మూఢాచారములను ఖండించి ఆ స్థానములో సదాచారములను ప్రతిష్ఠించారు.

అదే నీరు నీటి బుడుగ రూపుదాల్చితే అది నిలిచేది కొన్ని క్షణములే. 'జీవితము నీటి బుడగ వంటిది. అది కంటి ముందే ఉన్నట్టుండి పేలిపోతుంది. కనుక ఓ మానవుడా తస్మాత్ జాగ్రత్త! జాగ్రత్త! నీవు బ్రతికుండే కొద్దికాలములోనే నీ కోసం, నీ కుటుంబం కోసం, నీ సమాజం కోసం, నీ దేశం కోసం, నీ ధర్మం కోసం ఏదైనా సాధించి చూపించు అనే సందేశమును గ్రహించి నీ బ్రతుకును ఆదర్శవంతంగా మలచుకో!" అని పెద్దలు హితవచనములు పలుకుతారు. యుగాల చరిత్రను గమనిస్తే ఎంతోమంది మహానుభావులు అలా బ్రతికి చూపించి మనకు ఆదర్శప్రాయులయ్యారు. వీరసావర్కార్, టంగుటూరి ప్రకాశం పంతులు, దుగ్గిరాల గోపాలకృష్ణ, లాల్–బాల్–పాల్ వంటివారు ఈ కోవకు చెందుతారు.

అదే నీటిబొట్టు ఒక తామరాకుపైన పడిందనుకుందాము. అది ఆ ఆకుమీద ఇటు అటు ఊగిసలాడుతుందే తప్ప ఆ ఆకుకు తడిగా అంటుకోదు. ఆ తామరాకు పై పొరలమీద నీరు అంటుకోకుండా ఉండే ఒక ప్రత్యేకమైన ప్లాస్టిక్ వంటి పదార్థమును భగవంతుడు సృష్టించాడు. దానివలన ఆ నీరు తామరాకుకు అంటుకోదు. ఆ ఆకు మీద ఆ నీరు ఎంతో అందంగా ముత్యంవలే కదులుతూ చూపరులను కట్టి పడేస్తుంటుంది. కంటికి ఆనందము, మనస్సుకు ఆహ్లాదం, అంతేకాదు.



తాత్వికముగా కూడా 'భవసాగరమున తామరాకు మీద నీటిబొట్టువలే జీవించు!" అని చెప్తారు ఆధ్యాత్మికవేత్తలు. మనిషి జీవితము అలా సాగినపుడు అతను ఎన్నో ఇబ్బందులను, కష్టములను, అడ్డంకులను, వేదనను చాలా తేలికగా అధిగమించగలుగుతాడు. తత్త్వవివేచన వలన అతను వాటిని ఎదుర్కొంటూనే విజయములను సాధిస్తూ ప్రగతిపథాన ముందుకు సాగుతాడు. ఇది ఒక విశిష్ట జీవనశైలి. భారతీయులందరూ ఇటువంటి జీవితమును గడపడానికి ఇష్టపడతారు. అలాగని వారు తమ బాధ్యతలకు, కర్తవ్యములకు దూరంగా ఉండరు. అన్నింటిని యథాశక్తి నిర్వహిస్తూనే తామరాకు మీద నీరువలే మనుగడ సాగించి ఆధ్యాత్మిక తలములలో ఉన్నతి సాధిస్తారు.

లెక్కలేనంతమంది యోగిపుంగవులు, ఋషులు, మహర్షులు గృహస్థాశ్రమములో ఉంటూనే ఆధ్యాత్మిక స్థితిలో అత్యున్నత సోపానములను అవలీలగా అధిగమించారు. ఉదా॥ మనకు తెలిసినవారు శ్రీరామకృష్ణ పరమహంస–శారదామాత. యుగముల క్రిందటే సప్తఋషులు అటువంటి అరుదైన, అద్భుతమైన జీవన యాత్ర సాగించి వినీలాకాశమున కాంతులీనుతున్నారు. ఆ నీటబొట్టే ఒక ఆల్చిప్పలో పడితే మంచిముత్యమై ప్రకాశిస్తుంది. సముద్రములో నత్తగుల్ల పైన ఒక రకమైన పదార్థము ఆవరించి ఉంటుంది. దానిలోపల నత్త ఉంటుంది. అది ఆహారం కోసం పై కవచమును ఒక్కొక్కసారి రెండుగా విడదీసి పెడుతుంది. విషయం తెలియని మరో క్రిమి దానిలోకి ప్రవేశించి నత్తకు ఆహారమవుతుంది. ఈ ప్రక్రియలో అనుకోకుండా ఒక్కోసారి వర్షపునీరు దానిలో పడుతుంది. ఆ నీటిని ఆహారము అని భ్రమించి – దానిని స్వీకరించిన నత్త చనిపోతుంది. వాననీటి చుక్కతో నత్త శరీరము రసాయనిక ప్రక్రియకు లోనై లోపల ఒక ముత్యము తయారవుతుంది. అది ఎంతో ధర పలుకుతుంది. నత్త తన జీవితమును పణముగా పెట్టి చివరకు ఒక ముత్యం వలే మారుతుంది.

మానవుడు కూడా ఏదో ఒక ఆదర్శము కోసం లేదా లక్ష్యము కోసం లేదా సమాజ హితము కోసం తన జీవితమును త్యాగము చేసి వాటిని సాధించాలి. అలాంటి మనిషి జీవనశైలి ఎంతో మహోన్నతమైనది. వారికి తమ లక్ష్యము తప్ప ఇంక ఏ కోరికా ఉండదు. లక్ష్య సాధన కోసం తమ జీవితమును తృణప్రాయముగా బలిగావించుకుంటారు. ఉదా॥ భగత్‌సింగ్, మంగళ్‌పాండే, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్, వీర సావర్కార్... స్వాతంత్ర్యసమరంలో ప్రాణములను బలిగావించుకున్న అమరజీవులు వీరంతా. వీరు ఈ జాతికి అనుసరణీయులు. వీరి కీర్తి ఆకాశములోని

ధృవనక్షత్రము వలే కలకాలం నిలిచి ఉంటుంది.



ఒక్కొక్క కాలములో కురిసే వాన ఒక్కోరకమైన ఫలితమును ఇస్తుంది. ఎండాకాలంలో కురిసిన వాన శరీరమునకు సుఖమును, వాతావరణములో ఆహ్లాదమును కలిగిస్తుంది. శీతాకాలంలో కురిసే వాన వలన కొందరికి జలుబు చేస్తుంది. అదే వర్షాకాలములో కురిసేవాన రైతుల పాలిట కల్పతరువు. విత్తు నాటుకోవడానికి అనువైన వర్షం అది. రైతులు ఆనందిస్తారు.

అందునా స్వాతీ నక్షత్రమున్న రోజున కురిసిన వాన ఎంతో ప్రత్యేకతను కలిగి ఉంటుంది. ఆకాశములో స్వాతీ నక్షత్రము ఉన్నప్పుడు వర్షం కురుస్తున్న వేళ నత్త తన ఆహారము కోసం అదే సమయంలో తన కవచమును రెండుగా విడదీసి పెడితే ఆ వాననీరు ఆ చిప్పలో పడితే అది 'మేలిమి ముత్యమై' నిలుస్తుంది. ఒక్క ముత్యమే లక్షల రూపాయల ధర పలుకుతుంది. పైగా అల్పప్రాణియైన నత్త చనిపోయిన తరువాత మేలిమి ముత్యమై నవరత్నములలో స్థానం సంపాదించుకుంటుంది. ముత్యమును భగవత్ కైంకర్యములోను ***(మిగతా 19వ పేజీలో)***

ఎన్నిసార్లు చరిత్ర చదువుతున్నా
అసలు విషయం మరుగున పడిపోతోంది.
ఎవరికో దాహం వేస్తే మీరు స్పందిస్తే
సర్వజ్ఞత్వం అనుకున్నాం
ఎక్కడో చిరుప్రాణికి పెట్టిన అన్నం
మీ ఆకలి తీరిస్తే సర్వప్రాణ
స్వరూపుడవనుకున్నాం.
మీ మాటకు వర్షం ఆగితే
సర్వశక్తిమత్వమనుకున్నాం.
మీ స్పర్శకు రోగాలు తగ్గితే
కృపాసాగరుడవనుకున్నాం
అందరిలో వ్యక్తమయితే
చైతన్యరూపునివి అనుకున్నాం
ఆపదలు తొలగిస్తే ఆపద్భాందవుడవనుకున్నాం
మహిమలు చూసి మహితాత్ముడవనుకున్నాం

అన్నీ నిజమే. కానీ వీటన్నిటికీ కారణం..
మేమంటే మీకు ప్రేమని, చాలా చాలా ప్రేమని
మమ్మల్ని మీ నుంచి వేరుగా చూడలేనంత ప్రేమని
ప్రతి అణువులోను నిండిపోయేంత ప్రేమని,
మా ఇరుకు హృదయాలలో ఉండిపోయేంత ప్రేమని,
అడిగినవన్నీ ఇవ్వాలని,
అడిగించుకుని మరీ ఇవ్వాలన్నంత ప్రేమని,
జన్మల పర్యంతమైనా మాకోసం
మళ్ళీ మళ్ళీ రావాలన్నంత ప్రేమని,
మర్చిపోతున్నాం, మరుపులోనికి జారిపోతున్నాం.
మీ పరిపూర్ణత్వంలో మమ్మల్ని భాగం
చేసుకోవడం మీ అనుగ్రహం.
మా పరిపూర్ణత్వం మీరు కావడం మా అదృష్టం.

- చెన్నై సత్సంగ్ న్యూస్ లెటర్ నుండి



## "మ్రొక్కిన వరమీని వేల్పు గ్రక్కున విడువంగ వలయు"

**గురుబంధువు**: గురువుగారూ, మాకు ఒక కోరిక ఉంది. ఆ కోరిక తీరకపోతే బాబా ఇది మా మంచికే చేశారనుకోవచ్చు. కానీ అది మాకు అవసరం అయినప్పుడు, అది జరగనప్పుడు ఏమనుకోవాలి?

**గురువుగారు**: ఏమైనా అనుకోవచ్చు. మనకూ బాబాకు ఉండేటువంటి కనెక్షన్ కోరికే అయినట్లయితే, ఈ కోరిక తీరుస్తారు బాబా అని బాబా దగ్గరకు పోయి, ఆ కోరిక తీర్చకపోతే వదిలేసేయ్, అంతే.

**గురుబంధువు**: అంటే అది అవసరం అయితే?

**గురువుగారు**: ఏది అవసరం?

**గురుబంధువు**: అత్యవసరమైనటువంటిది కావాలనుకున్నపుడు...

**గురువుగారు**: ఏం చేస్తాం మనం? అడిగాము, ఆయనివ్వలేదు. అత్యవసరమైనదే కావాలని అనుకున్నప్పుడు. నేనేం కాదనడం లేదు. ఆయనివ్వలేదు, ఇచ్చేవాళ్ళ దగ్గరకు పోతాం. ఏం చేస్తాం మరి? అట్లా కాదు, ఆయన మనకు మంచిదయితే, అది నిజంగా అవసరం అయితే ఆయన చేస్తారని నమ్మకం ఉంటే అది వేరే విషయం. అందుకని ఆయన మనకు మంచిది కాదు కనుక చేయలేదు, ఇటువంటి జస్టిఫికేషన్స్ ఏం వద్దు. అది జస్టిఫికేషన్‌లాగా ఉండకూడదు. మనసులో ఉండేటువంటి అవగాహన లాగా రావాలి. జస్టిఫికేషన్‌లాగా వస్తే మాత్రం అవసరం లేదు. "మ్రొక్కిన వరమీని వేల్పు గ్రక్కున విడువంగవలయు" విడిచి పెట్టేయండి, అంతే... (గురువుగారి గంభీరమైన మౌనం) విడిచిపెట్టగలిగితే! ఎందుకంటే మనం ఏమనుకుంటామంటే, మనం ఏదో ఆయన్ని పట్టుకున్నామనుకుంటాం. ఉత్తమాట అది. మనమేం పట్టుకోం ఆయన్ని. విడిచిపెట్టడానికి ప్రయత్నించండి చూద్దాం. **అందుకనే నేను అంత ధైర్యంగా చెప్తున్నాను. మీరు పట్టుకుంటే మీరు విడిచిపెడతారు. మీరు పట్టుకోలేదు, ఆయనే పట్టుకుంది**



**మిమ్మల్ని.** పట్టుకుని ఉంటే వదిలేయండి. లేదండి, మీకు మంచిదది, అందుకనే ఇలా బాబా చేసారు, ఇటువంటి కథలు నేను చెప్పను. ఏం అవసరం లేదు. ఏం మనం బిజినెస్ చేస్తున్నామా బాబాతో? అయ్యా నీకో దండం పెడతాను, నీకో టెంకాయ కొడతాను, నీ చెవిలో జోరీగలాగా 'బాబా బాబా' అని అరుస్తాను, నాకీ కోరిక తీర్చిపెట్టు అని అడుగుతాం. తీర్చరు, తీర్చకపోతే నీతో



నాకేంటట. అందుకని వేరే దారి చూసుకో, చూసుకోగలిగితే! ఎప్పుడూ కూడానూ నేను అందరికీ చెప్పేది ఒక్కటే. అలా ఎందుకు జరిగింది?

బాబా దగ్గరకు వచ్చాము. మేము ఇలా అనుకున్నాము. మాకు ఇలా కీడు జరిగింది, మాకు అలా జరిగింది, మీకు ఇలా జరిగింది అనంటే నేనెవ్వరికీ జస్టిఫికేషన్ ఇవ్వను. బాబా మీకు మేలే చేశారు, మీ ప్రారబ్దానుసారంగా చేశాను, మీ కర్మానుసారంగా చేశారు. నా ఖర్మానుసారంగా చేశారు. ఈ సలహాలు నేను చెప్పను. బాబా దగ్గరకు ఆయన రక్షణ కోసం వచ్చావు నువ్వు. నువ్వు రక్షణ పొందలేదని నీ అనుభవం. వదిలి పెట్టేసిపో!


కాదూ, ఆయన పట్ల ప్రేమతో వచ్చావా, మన బిడ్డలకు ఎన్ని దుర్గుణాలున్నా, మన తల్లిదండ్రులు ఎటువంటి వారైనా మనం గౌరవిస్తున్నాము. ఎందుకంటే మన తల్లిదండ్రులు కనుక! అట్లాగే మన బాబా కనుక మనం ప్రేమిస్తాం. అలా ప్రేమించేవాళ్ళు కొంతమంది ఉంటారు.



బాబా నాకేం ఇచ్చారు? నేను బాబాకు ఏమిచ్చాను? వ్యాపారం క్రింద చూసుకునేటువంటి వాళ్ళు కొంతమంది ఉంటారు. త్రాసులో వేసి లెక్కపెట్టేవాళ్ళు! ఇరవై నాలుగు గంటలూ ఇదేనన్నమాట!

నాకు బాబా ఏం చేశారు? బాబా నాకేం చేశారు? వాళ్ళకు నేనుచెప్పే సలహా ఏంటనంటే, ఎవరికైనా సరే, ఆ అనుభవం రాకపోతే, ఎందుకంటే అన్నింటికంటే కూడానూ మన అనుభవం మనకు ఇంపార్టెంట్. అదే సత్యం.

మీ అనుభవంగాని, బాబా నాకు ఏం చెయ్యడం లేదనిపిస్తే



"మ్రొక్కిన వరమీని వేల్పు గ్రక్కున విడువంగవలయు". గ్రక్కున మళ్ళా ఆలస్యం కూడా చేయవద్దు దాని గురించి. No late, No delay. వెంటనే విడిచిపెట్టి వెళ్లిపోండి.

మీకు అనుభవం వచ్చింది. మీకు ప్రేమ కలిగింది. హ్యాపీ. మనం ప్రేమను పంచుకోవడానికి ఇక్కడ కూర్చోనున్నాము. బాబా ఇలా చేస్తారు. మీకు రక్షణ ఇస్తారు. అలా ఎందుకు చేశారు? ఇలా ఎందుకు చేసారు? అని బాబా తరపున వకాల్తా పుచ్చుకోవడానికి నేను ఇక్కడ లేను. నేను ఆయన లాయర్ని కాదు. And he doesn't need a defence.

మీ అందరి ఓట్ల వల్ల ఆయనేమన్నా గెలిచి, ఏదో ఆయన దేశానికి ప్రెసిడెంట్ కారు. ఆయన ద్వారా అనుభవం ఉంది. హ్యాపీగా అనుభవించండి. అనుభవం లేదు. గుట్టుగా నోరు మూసుకొని వెళ్లిపోండి. వదిలిపెట్టేసి వెళ్ళిపోండి, తిడుతూ కూర్చోవద్దు. అదీ నేను చెప్పేది!

నిన్నేమన్నా పిలిచారా రమ్మని? నువ్వు నా భక్తుడివి కా, నేను నీకు ఇది చేస్తాను అని హామీ ఇచ్చారా ఆయనేమన్నా? నిన్నేమన్నా భజన చేయమని చెప్పారా? నీకు ఉండే Insecurity కి ఆయన దగ్గరకు వచ్చావు, ఆయన్ని కోరావు. ఆయన నీకు ఎన్నో చేశారు కూడా. ఎక్కడో ఒక దగ్గర కొన్ని జరగలేదు. జరగకపోతే, నీకు ఇష్టం లేకపోతే వెళ్ళిపోవడమే, అంతే. నాకు చాలండి అనుకోవటం లేదా, బాబా నాకు మంచే చేసారు. ఎందుకు చేసారో ఇది. ఒక తండ్రి బిడ్డను ఒకటి రెండు తప్పులు చేస్తే మొట్టికాయ వేసినట్లుగా వేసి ఉండొచ్చు. దీంట్లో మన తప్పు ఏముంది? మనలో ఎక్కడెక్కడ మన అవగాహనలో లోపం ఉంది. మనం ఏమేం చేశాము దీంట్లో? మనం చేసిన పొరపాట్లు ఎన్ని ఉన్నాయి? వాటిని ఆలోచించుకొని, అవి సరిదిద్దుకోవడానికి ప్రయత్నం చేయండి. That is my first advice.



"గ్రక్కున విడువంగ వెలయు" లేకపోతే ప్రేమగా ఉండండి. రెండింట్లో ఏదో ఒక రకంగా ఉండండి అంతే.

–శ్రీ బాబూజీ

***(15వ పేజీ తరువాయి)*** వినియోగించవచ్చు, హారముగాను చేసుకోవచ్చు. మన దేశము మీద విదేశీ ఆక్రమణలు సాగినప్పుడు దేశం కోసం కష్టనష్టముల కోర్చి మన సంస్కృతి సంప్రదాయములను, దేశ గౌరవమును, స్వేచ్ఛను కాపాడటానికి జీవిత కాలమంతా పోరాటం సాగించి, అంతిమ విజయం సాధించిన మహానుభావులు ఎంతోమంది ఉన్నారు. దేశమాత మెడలో ముత్యాల పేరుగా నిలిచినవారు మహారాణాప్రతాప్, ఛత్రపతి శివాజీ, ఝాన్సీలక్ష్మీభాయి...



అదే నీటిబొట్టు సముద్రములో కలిస్తే సముద్రమై పోతుంది. సరిగ్గా అలాగే మనిషి ఒక్కొక్కసారి ఒక దైవీ ప్రణాళికలో భాగస్వామియైనచో ఎనలేని పేరు-ప్రతిష్టలు అతని స్వంతమవుతాయి. ఉదాహరణకు ఉడుత. ఆ చిన్ని ప్రాణి తన శక్తి కొలది శ్రీరామకార్యములో సాయం చేసింది. చరిత్రలో 'ఉడుతసాయం' అని నిలిచిపోయింది. అడవిప్రాణులైన వానరములు సైతం రామునికి అండగా నిలిచి అధర్మమునకు విరుద్ధముగా పోరాడి మానవులకు ఆదర్శప్రాయులైనాయి. గోపాలురు కూడా శ్రీకృష్ణుని యుగ పరివర్తనకు తోడుగా నిలిచి చరిత్రలో స్థానం సంపాదించుకున్నారు. ఇవన్నీ అతి చిన్న ప్రాణులు. ఎప్పుడైతే దైవీ ప్రణాళికలో పాలుపంచుకున్నాయో ప్రపంచము చేత గుర్తించబడ్డాయి.

పూజ ఆరంభించే ముందు చేసే ఆచమనమునకు వాడే నీటిచుక్కలు మరో ఉదాహరణ. ఆ నీటిని భావయుక్తంగా స్వీకరించినపుడు మనలోని కల్మషములను తొలగించి, శక్తులను ప్రోదిచేస్తుంది. పూజ పూర్తయిన తరువాత తాగే తీర్థం మనలోని పాపములను ప్రక్షాళన గావిస్తుంది. గురు-శిష్య అనుబంధం ఇటువంటిదే. మనిషి తన గురువు పాదములను ఆశ్రయించినప్పుడు ఆయన తన బోధనలతో శిష్యుడిని సన్మార్గంవైపు పయనింపచేసి భౌతిక, ఆధ్యాత్మిక జగత్తులో శక్తివంతుడిని గావిస్తాడు. ఇక్కడ భావనాత్మకమైన నీటి స్వీకరణతోపాటు శ్రద్ధ - నిష్ఠలు అత్యంత ఆవశ్యకము. ఉదా॥ చాణక్య - చంద్రగుప్తులు, శ్రీరామకృష్ణ పరమహంస-వివేకానంద, విశ్వామిత్రుడు-హరిశ్చంద్రుడు. ఇలా చెప్పుకుంటే చాలానే ఉంటుంది. చివరగా మనం అనుకోవాల్సినది ఒక్కటే. ఎంతో అమూల్యమైన మానవ జీవితమును వృధా చేసుకోకుండా మంచి పనులలో, గొప్ప లక్ష్యములలో, సేవా కార్యములలో వినియోగిస్తూ తరింపచేసుకోవాలి. ఇదే ఇక్కడ అందించబడిన సందేశం.

ఒకసారి యమధర్మరాజును ఒకానొక వ్యక్తి 'మనిషి చనిపోయిన తరువాత స్వర్గమునకు వెళతాడా



లేక నరకమునకు వెళతాడా? అనేది ఎలా తెలుస్తుంది?' అని ప్రశ్నించాడట. దానికి యముడు చనిపోయిన అతని శవం దగ్గర నిలబడి అక్కడ చేరినవారంతా ఏమి మాట్లాడుకుంటున్నారో ఆలకించు. వారు అనుకునేదాన్నిబట్టి అతను స్వర్గమునకు వెళతాడా లేక నరకమునకు వెళతాడా అనేది ఇట్టే తెలిసిపోతుంది అని జవాబిచ్చాడట. మంచి చెప్పుకుంటే స్వర్గమునకు – చెడు చెప్పుకుంటే నరకమునకు వెళతాడు అని వేరుగా చెప్పనవసరం లేదు కదా. అంతేకాదు ఎంతకాలం ఆ మంచి–చెడుల గురించి చెప్పుకుంటామో అంతకాలం వారు సజీవముగా ఉన్నట్లే. అందుకే జయంతులు, వర్ధంతులు చేసి వారిని స్మరించుకునేది.

అంటే మనిషి తాను జీవించి ఉన్నప్పుడు కొన్ని మంచి పనులను చేయాలి, అందరికీ ఉపయోగపడాలి. చెడు కార్యములను చేయరాదు. అంతేకాకుండా మానవుడు నైతికమైన కీర్తి–ప్రతిష్టలను సంపాదించాలి. నలుగురికి ఉపయోగపడే రీతిలో మనుగడ సాగించాలి. ఎంతో కొంతైనా సాధించి తనను తాను ధన్యం చేసుకోవాలి. అంతేతప్ప కొరగాని జీవితమును గడిపి భగవంతుడు ప్రసాదించిన అమూల్యమైన జీవితాన్ని, కాలాన్ని వృధా చేసుకొనరాదు. ముఖ్యముగా యువత సన్మార్గము వైపు పయనించి, దేశపు బంగారు భవితకు పునాదులు వేయాలి.

ఇదంతా జరగాలంటే చిన్నప్పటి నుండి చక్కని సంస్కారమును అందించే విద్యావ్యవస్థ తిరిగి ప్రాదుర్భవించాలి. కేవలం వైజ్ఞానిక, గణిత, సామాజిక శాస్త్రములోని పాఠములనే కాకుండా విద్యార్థులను సంస్కరించే మంచి విద్యావిధానము రావాలని కోరుకోవాలి. ఆ మార్పు మన నుండే ఆరంభం కావాలి. మనమే దానిని సాధించుకోవాలి. ఎందుకంటే ఇప్పుడున్న విద్యావిధానము ఆంగ్లేయుల పాలనా కాలములో వారి ప్రభుత్వము సుస్థిరపడటానికి, మన సంస్కృతి దెబ్బతినడానికి మెకాలే అను వ్యక్తి కుతంత్రముతో ప్రవేశపెట్టిన పద్ధతి. అందులో నీతి పాఠములకు చోటు లేదు. సంస్కరణ అన్నది జరగదు. విద్యార్థి ఒక యంత్రము వలే చదువుకొని మంచి మార్కులైతే సాధించగలడేమో కాని దేశమునకు ఉపయోపడే మంచి పౌరుడిగా, సుగుణశీలిగా మాత్రము మారడం లేదు. నేటి యువతను చూస్తే మనకు ఈ విషయము బాగా అర్థమవుతుంది. అందుకని మెకాలే ప్రవేశపెట్టిన ఆనాటి విద్యావ్యవస్థను మార్చి – మనం తిరిగి మంచి విద్యా ప్రణాళిక రావాలని ఆచరణాత్మకముగా సంకల్పిస్తూ ముందుకు కదులుదాం. **– *సేకరణ : గురుకృప***

# గురుకృపాలహరి

**కన్న కొలది కన్నులను కౌముదినింపెడి మీదు రూపమున్**
**విన్న కొలంది వీనులకు విందులు గూర్చెడి మీదు వాక్కులన్**
**ఎన్ని దినంబులైన దరసింపగ వచ్చు వినంగవచ్చునే**
**సన్నుతి చేసిదన్ గొనుము సంయమి శేఖరా చంద్రశేఖరా!**

***–జగద్గురు ప్రణతి***



మానవమేధ చంద్రునిపై, అంగారకునిపై అడుగుపెట్టే స్థాయికి చేరిపోయింది. మానవమేధ కృత్రిమ అవయవాల రూపకల్పన నుండి ప్రకృతిలో దాగిన ఎన్నో రహస్యాలను ఛేదించేంత ముందుకు సాగిపోయింది. మానవ మేధ మనిషి మనసు లోగుట్టును కూడా తెలుసుకొని ఇష్టాయిష్టాలను బట్టి రంగును, నివసించే ఉష్ణోగ్రతను, చూసే కాంతిని కూడా నియంత్రించే కృత్రిమ మేధస్సు అనే ఆకృతిని ధరించడం మొదలుపెట్టింది. ఇన్నీ ఉన్నా మనిషి అంతరంగం మాత్రం వెలితిగానే ఉండిపోయింది. వెలుగు నిండకుండింది. అంబరమంటేంత సంతోషమైనా, అంతులేని దుఃఖమైనా సాటి మనిషితో పంచుకుంటేనే అది పెరిగినా, తరిగినా! మనిషికి మనిషే సంతోషాల కూర్పు. మనిషికి సాటి మనిషే నిజమైన ఓదార్పు. మేధ సృష్టించిన ఈ 'భారం' మనుషుల మధ్య 'దూరం' పెంచింది. ఒక తెలుగు కవి చెప్పినట్లు 'మాయమై పోతున్నడమ్మా! మనిషన్నవాడు... మచ్చుకైనా లేడు చూడు మానవత్వము ఉన్నవాడు" – మాయమైపోతున్న మనిషి ఉనికిని అవనిపై నిలిపేందుకు మాధవుడే – మహాత్ముడుగా – తోడు మనిషిగా దిగివచ్చాడు. ఏ పరబ్రహ్మతత్త్వం ఈ ప్రకృతి నిండా ప్రభవించి, ఆవరించి 'దివ్యత్వం'గా ప్రకాశిస్తుందో – ఆ తత్త్వమే మహాత్మునిగా – 'మానవత్వం'గా వికసించింది. మాధవుడైనా మనిషిగా పుడితే శత వసంతాలే జీవించే అవకాశం ఉంది. కానీ వారి శతవసంతాల జీవనం – ఆ జాతి మనుడగ సాగించినంత కాలం అనునిత్యం స్మరించుకుంటూనే ఉంటుంది.ఆ మహితాత్ముల పదస్పర్శ పరుసవేదిలా పనిచేస్తూనే ఉంటుంది. వారి పదముద్రలే జనపదాలై, జీవనదాలై, బోధలై, గాధలై, మది మదిని తట్టి లేపుతాయి – దారిచూపుతాయి.

ఆ మహాత్ముని రూపం కనులలో నింపుకున్న కొద్దీ వెన్నెల నిండిపోతుంది. వారి మాటలు విన్నకొద్దీ చెవులకు వీనుల విందుగా అనిపిస్తుంది. ఎన్నిరోజులైనా ఆ రూపాన్ని చూస్తూ ఉండిపోవాలని పిస్తుంది. సద్గురువుగా ప్రభవించిన ఆ మునివర్యుని లీలా విశేషాన్ని ఎంత వర్ణించినా, కవనాల



మాలలు సమర్పించినా, జిహ్వాకు పరితాపం తీరదు. ఇది శరణాగతుల ఆర్తి – సద్గురు చంద్రుల కీర్తి. ఇన్ని విశేషణాలున్నా ఆయన మాత్రం కేవలం మనందరిలాగే కరచరణాదులతో తిరుగాడే మానవుడే! అందుకే అన్నారు 'నడయాడే దైవం' అని. ధరాతలంలో ఆ దివ్యత్వం ఓ వంక శోభిస్తూనే – పతనమైపోతున్న జీవిని 'మానవత్వం' వైపు, ఆపై 'మాధవత్వం' (దైవత్వం) వైపు చేయిపట్టి నడిపిస్తుంది. గమ్యమే తానైనా, గమనంలోనూ మనతోనే ఉండి తన చరణ కమలాల చెంత చేర్చుకొనే కారుణ్యమూర్తి గురువు. "మానవత్వాన్ని మించింది కాదు జ్ఞానం" అన్నది పూజ్య గురుదేవులు శరశ్చంద్రుల వాణి. అంతేకాదు, పరమాచార్యుల గురించి "సజ్జన హృదయ పీఠాధిపతి కంచిపెద్దస్వామి" అని, "మఠాధిపతుల కోవలో శ్రీస్వామివారు విజాతీయులా అని అనిపిస్తుంది" అని మరోసారి వారు వ(ర)చిస్తే అవగతం కాలేదు – స్వామివారి చరిత్రను అధ్యయనం చేసేంతవరకు. ఇదిగో సజ్జన హృదయ పీఠాధిపతుల దివ్యత్వపు 'శోభ' – సాటి మనిషిలో మౌలిక మార్పును తీసుకొచ్చే మానవత్వపు 'ప్రభ'. అవధరించండి.

దక్షిణ విల్లుపురం చెందనూరు రైల్వేస్టేషన్‌కు దగ్గరలో ఉన్న చిన్న గ్రామం వడవంబలం. కంచి పీఠ పరంపరలో పీఠాధిపతులైన శ్రీఆత్మబోధేంద్ర సరస్వతీ స్వామివారు ఆ గ్రామంలో సిద్ధి పొందారని తెలుసు. ఆత్మబోధేంద్రులు రుద్రపాఠములో మహోన్నతులు. వారు ఎంతో కాలం కాశీవిశ్వేశ్వరుని చెంతన ఉండినట్లు చారిత్రక ఆధారాలు చెపుతాయి. పరమాచార్య స్వామి వారు వడవంబలం దగ్గరలో చాతుర్మాస్యం చేస్తున్న సమయంలో ఆ గ్రామంలోని పొలాలు, తోటలు, ఖాళీస్థలాలు, ఇలా అన్నిచోట్లా కలయదిరిగి వారి గురు పరంపరలోని 'స్వామి' సమాధి స్థాన అన్వేషణలో నిమగ్నమయ్యారు.

ఆశ్రిత జనులు, గ్రామస్థులు కూడా స్వామివారిని అనుసరించారు. అలా వారి పదసంచారంలో ఒక పొలంలో ఆగిపోయారు స్వామి. గ్రామస్థులు స్వామివారితో "స్వామీ! ఇతర పనులకై మేము ఈ ప్రాంతంలో ఇతఃపూర్వం త్రవ్వడం వంటి పనులు చేసి ఉన్నాము. ఇక్కడ మహాత్ములెవ్వరూ సిద్ధి పొందినట్లుగానీ, అట్టి చిహ్నాలు గానీ మేము గమనించలేదు" అని తెలియచేసారు. కానీ స్వామివారు మాత్రం ఆ ప్రాంతంలో త్రవ్వమని ఆదేశించారు. త్రవ్వేటపుడు పలుగు, పారలను ఉపయోగించవద్దని, కేవలం నీరు, పాలు పోస్తూ మట్టిని తీయమని సూచించారు. కొంతసేపటికి కొన్ని అడుగుల్లోనే ఒక శిరస్సు యొక్క అవశేషం బయల్పడింది. ఇంతలోనే సాంబమూర్తి అనే భక్తుడు పెద్ద ఎత్తున అరుస్తూ



"ఆపండి... ఆపండి...." అంటూ కుప్పకూలి స్పృహ కోల్పోయాడు. కొంత సమయానికి తేరుకున్న సాంబమూర్తి తను దర్శించిన విషయాన్ని అక్కడి వారితో ఇలా చెప్పాడు. "కాషాయాంబరాలు ధరించిన ఒక యతివరేణ్యులు చేత దండమును ధరించి, రుద్రాక్ష మాలంకృతాలై ఆకాశమంత ఎత్తులో దర్శనమిస్తున్నారు. వారి చెంతన సన్యాస శిష్యులు కూర్చొని ఉపనిషద్ తత్త్వాలను సభక్తికంగా వల్లె వేస్తున్నారు. ఇంతలో వారు ఉపనిషద్ గానాన్ని ఆపమని ఆదేశించారు. వారు చెప్పినట్లే నేను అక్కడి వారిని ఆపమని ఆదేశించారు – ఇంతలోనే వారి నుండి "త్రవ్వవద్దు, త్రవ్వవద్దు" అన్న మాటలు స్పష్టంగా వినిపించాయి. ఆకాశభాసమైన వారి రూపం చిన్నదవుతూ వారు నా దృష్టికి గోచరించలేదు. "సదాశివం... సదాశివం" అన్న మాటలు చెవులో వినిపిస్తుండగా నాకు తెలివివచ్చింది" అని తన అనుభవాన్ని పంచుకున్నాడు సాంబమూర్తి. అతని స్థితిని, దర్శనమయిన తీరును విని గమనించిన గ్రామస్థులు నిశ్చేష్టులయ్యారు. తేరుకున్న తర్వాత తమకు ఏమి చేయాలో దిశానిర్దేశం చేయమని పరమాచార్యులను అర్థించారు గ్రామస్థులు. స్వామివారి కృపాఫలంగా అక్కడ ఒక చక్కటి బృందావనం నిర్మించబడింది. మహాత్ముల సమాధిస్థానాలు – ఆర్త జిజ్ఞాస ముముక్షువులకు 'సమాధాన' సన్నిధానాలు. వాటిని పరిరక్షించుకోలేని అశక్తతకు – 'శక్తి'ని ప్రసాదించి విశ్వమానవాళికి శ్రేయస్సును అందించిన నడయాడిన దివ్యత్వం – పరమాచార్య స్వామివారు. ఇదిగో స్వామివారి దివ్యత్వాన్ని దర్శింపచేసే మరో లీలా విశేషం.

### *అమ్మగారికి ప్రాణదానం*

1982లో మా తండ్రిగారికి శతాభిషేకం జరిగింది. శతాభిషేకానికి జరపవలసిన ప్రక్రియ యావత్తు శ్రీవారే వ్రాయించి పంపారు. యధావిధిగా జపాలు, హోమాలు వగైరా జరుగుతూ ఉన్నవి. రెండవ రోజున మా అమ్మగారికి హఠాత్తుగా జబ్బు చేసింది. ఆమెకు మధుమేహం ఉన్నందువల్ల కోమాలోకి వెళ్లింది. ఆమె స్థితిని చూసి మేమందరమూ ఆందోళన పడ్డాము. మా తండ్రిగారు మాత్రం చలించలేదు. అప్పుడు స్వామివారు దేశ సంచారం చేస్తూ ఉగర్ అనే గ్రామంలో ఉన్నారు. వెంటనే నేను మద్రాసు నుండి విమానంలో హైదరాబాద్‌కు వచ్చి, అక్కడి నుంచి కారులో బయలుదేరి రాత్రి 2 గంటలకు ఉగర్ చేరుకున్నాను. స్వామి వారప్పుడు నిద్రలో ఉన్నారు. చూడడానికి వీలులేదని శిష్యులన్నారు. వేకువజాము నాలుగున్నర గంటల వరకు నేను కారులోనే ఉండి, అప్పుడు స్వామిని చూడడానికి



వెళ్ళాను. నేను ఫలానా అని చెప్పగానే శ్రీవారు నన్ను పిలిచి ఈ రాత్రివేళ హఠాత్తుగా రావడానికి కారణమేమి అని అడిగారు. మా నాన్నగారికి శతాభిషేకం సందర్భంగా జపాలు ప్రారంభించామని, ఉన్నట్టుండి రెండోరోజున మా అమ్మగారికి జబ్బుచేసి కోమాలో ఉన్నదని, ఆసుపత్రిలో చేర్చామని, ఏమి చెయ్యడానికి తోచక తమ వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చానని స్వామికి విన్నవించాను.

స్వామి కళ్ళు మూసుకుని కొన్ని నిమిషాలు ధ్యానం చేసి "ఏమీ ఫరవాలేదు, మీ అమ్మగారికి భయం లేదు. మీ నాన్నగారు చేసిన దానాలు, ఘనకార్యాల వల్ల కొంత దృష్టి వచ్చింది. ఇకమీదట అంతా సక్రమంగా జరుగుతుందని" ధైర్యం చెప్పి కొద్దిగా పంచదార పొట్లం కట్టి ఇచ్చి, దానిని మా అమ్మగారి నోట్లో వేయవలసిందని ఆదేశించారు. తిరుగు ప్రయాణానికి నీకు విమానం అందుతుందిలే అన్నారు శ్రీవారు. అయినా నాకు విమానం అందుతుందని నమ్మకం లేదు. అందదేమో అనే సందేహంతోనే హైదరాబాదు చేరాను. ఇంటికి వెళ్ళి విమానం సంగతి ఫోనులో అడుగగా విమానం గంటన్నర ఆలస్యంగా బయలుదేరుతుందని చెప్పారు. సీట్లు కూడా ఉన్నవని తెలిసింది. త్వరగా వెళ్ళి విమానంలో కూచున్నాను. విమానం అందిందేగాని, నేను మద్రాసు చేరే లోపల అమ్మగారి స్థితి ఎలా ఉంటుందో ఏమో అని ఆందోళన పడుతూనే ఉన్నాను,. మానవమాత్రుణ్ణి కాబట్టి. మద్రాసులో విమానాశ్రయం వద్దకు కారు వచ్చింది. "అమ్మ స్థితి ఎలా ఉన్నదని ఆదుర్దాగా డ్రైవరును అడిగాను. "వేకువఝామునే నాలుగున్నర గంటలకు అమ్మగారు కళ్ళు తెరిచారు" అని డ్రైవరు చెప్పగానే 'అమ్మయ్యా' అనుకున్నాను. విచిత్రం సరిగ్గా నాలుగున్నర గంటలకే ఉగర్‌లో స్వామివారు కళ్ళు మూసుకుని ధ్యానం చేసి, ప్రసాదం నా చేతికిచ్చి భయం లేదంటూ నన్ను పంపించారు. నేను మద్రాసు చేరగానే స్వామివారిచ్చిన చక్కెర ప్రసాదం పాలల్లో కలిపి మా అమ్మగారి చేత తాగించాను. ఆ పాలు తాగడంతోనే మా అమ్మగారు కళ్ళు తెరిచి మాట్లాడటం మొదలుపెట్టింది. అటు తరువాత మా తల్లిదండ్రులు పార్వతీపరమేశ్వరులు లాగా శతాభిషేకం సక్రమంగా, సలక్షణంగా జరుపుకున్నారు. 1983లో మా అమ్మగారు ఉత్తరాయణ పుణ్యకాలంలో పౌర్ణమి శుక్రవారంనాడు స్వర్గస్తులైనారు. ఆ సంవత్సరం శ్రీవారు కర్నూలులో ఉండగా మేము శ్రీవారి దర్శనం చేసుకుని అమ్మగారు కాలం చేసిన సంగతి శ్రీవారికి చెప్పాము.



“మీ అమ్మగారు సంవత్సరం క్రితమే కాలం చేసి ఉండవలసింది. కాని శ్రీ కామాక్షీ అమ్మవారు మీ అమ్మగారి ఆయుర్దాయం ఒక సంవత్సరం పొడిగించింది. మీ అమ్మగారు కొడుకులతో, కోడండ్లతో, మనమలు, మనుమరాండ్రతో సర్వసౌఖ్యములు అనుభవించి, మీ నాయనగారి శతాభిషేకం సలక్షణంగా జరుపుకుని ఉత్తమ లోకానికి వెళ్ళింది. ఆమెకై మీరు ఏ మాత్రం చింతించ పనిలేదు. ఆమె ఎంతో అదృష్టవంతురాలు” అంటూ శ్రీవారు మమ్ము ఓదార్చారు.

త్రికాలవేదులై, సర్వ సమర్థులై, ఆర్తత్రాణ పరాయణులైన జీవుల ఈప్సితములను కరుణతో అనుగ్రహించుటకై సృష్టినే శాసించగల దైవమై నడయాడనప్పటికీ – కడవరకు మానవత్వ పరిమళాలను వెదజల్లుతూ మనిషిగా మనల్ని మలచేవారు సద్గురు చంద్రులు. పై లీలా వినోదాలను విశ్లేషించుకుంటే నడయాడిన భగవద్రూపమే పరమాచార్యులని స్పష్టమవుతుంది. ఇదిగో! ఇప్పుడేనా అత్యున్నత స్థితిలో మనం వారిని దర్శించింది. భవబంధాలను, చివరకు యజ్ఞోపవీతాన్ని కూడా సన్యాసాశ్రమ ధర్మాన్ననుసరించి త్యజించిన పరమాచార్యులు – మనిషి జీవిత గమనంలో మౌలికమైన మార్పుకై కన్నతండ్రి కంటే కూడా తపించిపోయేవారు. ‘జరథావ్’, ‘కొంచెం ఆగు’ నా బిడ్డలు ఇంటికి చేరాలి అని ప్రకృతినే శాసించే శ్రీసాయి సమర్థులు – భక్తుడు పురందరే ఖాళీ కడుపుతో ఉంటే కన్నతల్లిలా తల్లడిల్లిన సంఘటన స్మృతిలో మెదులుతోంది. పరమాచార్యుల పరమ వాత్సల్యం ఈ క్రింది అనుభవంలో గురుదేవులు శ్రీబాబూజీ చెప్పిన “మఠాధిపతుల కోవలో స్వామివారు విజాతీయులా? అన్పిస్తుంది” అన్న మాటలకు సద్దర్శనం ఈ క్రింది అనుభవం.

పరమాచార్య స్వామివారు ఒకరోజు ఉదయం చెన్నైలోని మ్యూజిక్ అకాడమీ నుండి పశ్చిమంగా నడుచుకుంటూ వస్తున్నారు అది బహుశా 1964–1965 ప్రాంతం అనుకుంటా. మహాస్వామి వారితో పి.జి.పాల్, నీలకంఠ అయ్యర్, శ్రీమఠం శివరామ అయ్యర్, పానాంపట్టు కణ్ణన్, శ్రీకంఠన్, రాయపురం బాలు మరియు నేను ఉన్నాను. దారిలో పది ఇరవై మంది దాకా భక్తులు మాకు తోడయ్యారు. గోపాలపురం వైపు వెళ్ళే మలుపులో స్వామివారు నన్ను పిలిచి, “వెనుక అక్కడ కిరాణా కొట్టు దగ్గర తలపై శిఖతో నోటి నుండి పొగ వదులుతూ ఒక వ్యక్తి నిలబడి ఉన్నాడు కదా చూసావా? అతని వద్దకు వెళ్ళి పరవాక్కరై శ్రౌతిగళ్ గురించి అడిగి రా” అని చెప్పారు. నేను అతని వద్దకు పరిగెత్తాను. అతను ఆ కొట్టుకు వేలాడదీసిన తాడు చివరన ఉన్న నిప్పుతో బీడి



**ఎప్పుడు ఎక్కడ ఎలా పనిచేయాలో అప్పుడు అక్కడ అలా చేస్తేనే జీవితంలో వృద్ధి – లేకపోతే వయస్సులో వృద్ధి.**



అంటించుకుంటున్నాడు. అతని వద్దకు వెళ్ళి అడిగాను. “ఓయ్! నీకు పరవాక్కరై శ్రౌతిగళ్ తెలుసా?” అని. అతను కాస్త కంగారుపడి, చేతిలోని బీడీ క్రింద పడేసి, “మీరు ఎవరు? ఎందుకోసం అడుగుతున్నారు?” అని అడిగాడు. “ఆచార్య స్వాములు కనుక్కోమన్నారు”. “పెరియవా? ఎక్కడా?” “అక్కడ” అని నేను చేయి చూపించేసరికి అతను పరుగు లంకించుకొని అటువైపుగా వెళ్ళిపోయాడు. నేను కొద్దిసేపు వేచి చూసి, స్వామివారికి చెప్పాను “నేను అతణ్ణి అడిగాను. ఏమీ బదులు చెప్పకుండా పారిపోయాడు” అని. స్వామివారు మౌనంగా గోపాలపురం వైపు కదిలారు. కొద్దిదూరంలో ప్రహరీ అవతల చక్కని పందిరి వేసి తోరణాలతో అలంకరించారు. భక్తులు స్వామివారిని పూర్ణకుంభంతో స్వాగతించారు. పెద్దభవంతి ముందర ఉన్న నాలుగు మెట్లు ఎక్కగానే వరండా మూలలో స్వామివారు ఆసనం వేయించుకుని కూర్చున్నారు.

భక్తులు స్వామివారికి నమస్కరించి సెలవు తీసుకున్నారు. కార్యాలయాలకు వెళ్ళాలి కాబోలు! స్వామివారు లేచి లోపలికి పోయేంతలో నుదిటిపై విభూతి రేఖలతో, చేతులు, ఎదపై అడ్డదిడ్డంగా పెట్టిన విభూతితో, నడుముకు ఒక టవల్ చుట్టుకుని వచ్చిన ఒక వ్యక్తి వచ్చి స్వామివారికి సాష్టాంగం చేసి నిలబడ్డాడు. స్వామివారు మరలా కూర్చుని నన్ను చూపిస్తూ, “ఎవరతను?” అని అడిగారు. “కొద్దిసేపటి క్రితం పరమాచార్య స్వామివారే ఈ వ్యక్తి ద్వారా నాకు పరవాక్కరై శ్రౌతిగళ్ తెలుసేమో కనుక్కుని రమ్మని పంపారు”.

అవును “నేను పరవాక్కరై శ్రౌతిగళ్ మనవడిని. నా పేరు ప్రణతార్థి”. “ప్రణతార్థి అని పలకవద్దు. అది స్వామివారి పేరు. ప్రణతార్థి హరణ్ లేదా హరణ్ అని చెప్పు. తనని నమస్కరించిన వారి పీడలను పోగొట్టే స్వామి ఆయన. అది ఆ నామము యొక్క అర్థము” అన్నారు స్వామి. “అందరూ నన్ను ఇలాగే పిలుస్తారు. అలవాటయిపోయింది”. “నువ్వు ఇంకా ఇలా ఉండటానికి కారణం ఏంటి? అధ్యయనం (వేదాధ్యయనం) చేశావా?”. “తాతగారు సామము నేర్పించారు”. ఒక సామవేద పన్నమును ఉదహరిస్తూ “ఏది ఈ సామ పన్నం చెప్పు” అన్నారు. రెండు మూడు వాక్యాలు చెప్పగలిగాడు. అతని సామగానము పెద్ద కంఠంతో మంచి సమ్మోహన శక్తితో చాలా దివ్యంగా ఉంది. “తరువాత గుర్తులేదు” అన్నాడు. “నీ తోడబుట్టిన వారు పెద్దవారా? చిన్నవారా?” “ఇద్దరూ పెద్దవారు. వారు ఇంగ్లీషు చదువులు చదివి ఎక్కడో ఉద్యోగాలు చేసుకుంటూ ఉన్నారు. నా స్వరం బావుండడంతో

తాతగారు సామవేదం నేర్పారు. నాకు అది ఇష్టం లేదు. అందుకే ఇంటి నుండి పారిపోయాను". "ఇపుడు ఏమి చేస్తున్నావు?" "నేను పోలీసులకు సహాయ పడుతుంటాను". "పోలీసులకు సహాయమా? ఏమి సహాయం చేస్తావు?" "వారు నన్ను న్యాయస్థానాలకు తీసుకుని వెళతారు. నేను సాక్ష్యం చెపుతాను. వారు డబ్బులిస్తారు". "ధూమపానం ఎలా అలవాటు అయ్యింది?"



"వాళ్ళతో వెళ్ళినపుడు ఎక్కువ మోతాదులో కొంటారు. నాకు రెండు మూడు ఇచ్చేవారు" "నువ్వు చూసినవాటినే న్యాయస్థానంలో చెబుతుంటావు. అవును కదా?" "నేను ఏమీ చూడలేదు. వారు ఇలా చెప్పమని చెబుతారు. నేను అదే చెప్తాను" "న్యాయవాదులు ఎక్కువ ప్రశ్నలు వేస్తారు కదా!" "అవును అందుకే పోలీసులు నన్ను హత్య జరిగిన స్థలానికి తీసుకు వెళ్ళి అది ఎలా జరిగిందో విపులంగా చెపుతారు. నేను ఇక్కడ నిలబడ్డాను, ఇంతమంది ఉన్నారు, నేను చూస్తున్నాను. హంతకుడు తూర్పువైపుగా పరిగెత్తి వెళ్ళాడు, చేతిలో కొడవలి ఉంది. అందులో నుండి రక్తం కారుతోంది, ఇలా నాకు నేర్పిస్తారు. ఎన్నో కేసుల్లో సాక్ష్యం చెప్పాను కదా. నాకు అనుభవం ఉంది. లాయర్లు నన్ను ఎంత తికమక పెట్టినా, నేను అంతే తెలివిగా సమాధానం ఇస్తాను. రెండు మూడు సార్లు మాట తడబడ్డాను. అప్పుడు పోలీసులు నన్ను బాగా కొట్టారు". "కోర్టుకు వెళ్ళేటప్పుడు చొక్కా అవి వేసుకుంటావా?" "లేదు, లేదు దానికి పోలీసులు ఒప్పుకోరు. నేను పెద్ద పెద్ద విభూతిపట్టీలు పెట్టుకోవాలి. సబ్బు పెట్టి నా యజ్ఞోపవీతాన్ని తెల్లగా ఉంచుకోవాలి. నడుముకు తుండు కట్టుకోవాలని కూడా ఆదేశిస్తారు". "ఇలా సాక్షిగా మారడం తప్పు కాదా"? "అవును. పాపమే. నాకు బాగా తెలుసు. కాని నాకు ఇక దారి లేదు". "అలాగా! మరి ఒక దారి చూపిస్తాను. చేస్తావా?" "దయచేసి సెలవివ్వండి". "మైలాపూర్‌లో కపాలీశ్వర దేవాలయం ఉంది. సాయంత్రాలు అక్కడకు వెళ్ళు. పడమర గోపురం దగ్గర రోజూ చెత్త ఊడ్చి నీళ్ళు చెల్లు. నీకు పది రూపాయలు, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయిస్తాను. "ఈ ఊడిగాలు, ప్రసాదాలు అవన్నీ నాకు పడవు". "దేవాలయ ప్రసాదం కాదు. రోజుకొక భక్తుని ఇంట నీ భోజనం ఏర్పాటు చేస్తాను. నువ్వు ఆ పది రూపాయలతో రాత్రిపూట తిను". "నాకు అవన్నీ సరిపడవు, నా వల్ల కుదరదు". " అంత ఆతృత ఎందుకు? మఠంలో రెండు రోజులు ఉండు. చంద్రమౌళీశ్వర పూజ చూడు. పూజ అయిన వెంటనే నీకు ఆహారం ఏర్పాటు చేయిస్తాను. తరువాత ఆలోచించి చెప్పు". "ఈ రోజు కుదరదు. ఎగ్మోర్ కోర్టులో



ఒక పెద్ద కేసు ఉంది. నేను అక్కడకు సాక్ష్యం చెప్పడానికి వెళ్ళకపోతే నా వీపు విరగ్గొడతారు. నన్ను వెళ్ళనివ్వండి" అని అతను వెళ్ళిపోయాడు. ఆ ప్రహరి దాటి వెళ్ళిపోయేంతవరకు అలా చూస్తుండిపోయారు. తరువాత స్వామివారు లేచి లోపలకు వెళ్ళారు. నీలకంఠ అయ్యర్, నేనూ వెనకాతలే వెళ్ళాము. స్వామివారు తిరిగి చూసారు. నీలకంఠ అయ్యర్ చిన్నగా అన్నారు, "మహాస్వామివారు అంతగా చెప్పినా అతను వినిపించుకోలేదు". "అలాగే ఉండనీ, జనాలకు తప్పుడు సాక్ష్యం చెప్పడం అలవాటు చేసారు ఈ పోలీసులు" అన్నారు స్వామివారు. అందుకు నీలకంఠ అయ్యర్ "వారు మాత్రం ఏం చేస్తారు? పట్టపగలే అంతమంది ముందు ఒక హత్య జరిగినా కూడా ఎవరూ సాక్ష్యం చెప్పడానికి ముందుకురారు. అది ఎవరు చేసారో తెలిసి కూడా ఎవరూ సాక్షిగా రావడానికి ఒప్పుకోరు. అందరికీ వాళ్ళ వాళ్ళ పనులు ఉన్నాయి. పోనీ అలా వెళ్ళినా ఈ లాయర్లు వారిని పదే పదే కోర్టుల చుట్టూ తిప్పుతారు. తీరా నిందితుడే ఒప్పుకున్నా సాక్ష్యం లేదని కేసు కొట్టేస్తారు. తరువాత పోలీసు వ్యవస్థ సరిగా లేదని, కనుక వారికి తప్పుడు సాక్ష్యం చెప్పించడం తప్ప వేరే దారి లేదు". **"ఓహో! నేరం చెయ్యడం మొదటి తప్పు. చూసి కూడా సాక్ష్యం చెప్పడానికి రాకపోవడం రెండవ తప్పు. చూడనివారిని సాక్ష్యంగా తయారు చేయడం మూడవ తప్పు. ఈ తప్పులను సమర్థించడం మరొక తప్పు".** "మహాస్వామివారు నన్ను మన్నించాలి. ప్రపంచంలో జరుగుతున్నది నేను తెలిపాను అంతే".

"ఇది మరీ బాధాకరం. ఇదంతా ఒక బ్రాహ్మణుని విషయంలోనా! తప్పుడు సాక్ష్యం చెప్పినా ఒక బ్రాహ్మణుడు చెబుతున్నాడు. అంటే కోర్టు కూడా నమ్ముతుందనే కదా. పోలీసులు ఇలా చేస్తున్నారు. ఏది ఏమైనా కానీ, ఆ శ్రౌతి మనముడు ఇలా..." "మహాస్వామివారు చెప్పినదేదీ అతని చెవిన పడలేదు" "చెప్పాడు కదా. కోర్టుకు వెళ్ళకపోతే పోలీసులు కొడతారు అని. అతడేంచేస్తాడు" "పరమాచార్యులవారు చాలా క్లేశ పడుతున్నారు. మేమేమైనా చెయ్యగలమా?" "ఒక సన్యాసి తన మనస్సులో సుఖదుఃఖాలకు, కష్టనష్టాలకు తావివ్వకూడదు అని మీకు తెలుసు కదా" అని స్వామివారు స్నానానికి వెళ్ళిపోయారు. మధ్యాహ్నం మూడు గంటలప్పుడు పూజగది ప్రక్కన ఉన్న వరండాలో నేను పడుకొని ఉన్నాను. రామా! అని అరుపు వినబడడంతో లేచి వచ్చాను. మేలూర్ మామ – రామచంద్ర అయ్యర్ – మహాస్వామివారి పూజా పర్యవేక్షకులుగా ఉన్నారు. చాలా సాంప్రదాయం




పాటించే మనిషి. పూజ సహాయకులకు ఆయన సింహస్వప్నం. పూజకట్టులో చిన్న పొరపాటును కూడా సహించరు. దేవతా మూర్తులను లోపల పెట్టి తాళం వేసిన తరువాత కూడా వాటిని పర్యవేక్షిస్తుంటారు. వారు లోపల నుండి పెద్ద ఇత్తడి గిన్నెతో బయటకు వచ్చారు. నన్ను అక్కడ చూసి రమ్మని సైగ చేసారు. "ఉదయం పరమాచార్య స్వామివారితోపాటుగా వచ్చావా?" అని అడిగారు. "అవును వారితోపాటే వచ్చాను", "అప్పుడు ఏమైనా జరిగిందా?" "ఏమి లేదు", "లేదు, ఏమో జరిగింది. మహాస్వామివారు ఈరోజు పూజ చేయలేదు". "అలాగా! అది ఏం జరిగిందంటే... అని పరవాక్కరై శ్రౌతిగళ్ మనవడి గురించి మొత్తం జరిగినదంతా చెప్పాను. చేతిని నుదిటిపై బాదుకుంటూ ఆయన చలించిపోయారు. అప్పుడే స్వామివారు అటువైపుగా వచ్చారు. నేను నమస్కరించాను. "మేలూర్ మామ ఏం చెప్పాడు. చూస్తే ఈరోజు భోజనం చేసినట్టు లేదు. ఏమైనదో కనుక్కొన్నావా?" అని అడిగారు. "నేను కళ్ళు తుడుచుకున్నాను. "నాతో ఏదో చెప్పాలని అనుకుంటున్నావు కదా! చెప్పు మరి" "నేనేమి చెప్పగలను పెరియవ! శ్రీధర అయ్యావాళ్ శ్లోకం ఒకటి స్ఫురించింది". "అయ్యావాళ్ శ్లోకమా? భక్తి రసంలో ముంచుతుంది. ఏది చెప్పు ఒకసారి"

**త్వన్ నామధ్యేయ రసికాః తరుణేందు మౌళే – దుఃఖం న యాన్త కిమపీతి హి వాదమాత్రం**
**దేశమీకిల స్వవిపతీవ వహంతి దుఃఖం – త్రు కోకరీ భవతి దుఃఖాన జంతుమాత్రే**

"మరొక్కసారి చెప్పు" నేను మరలా చెప్పాను. "అర్థం కూడా చెప్పు చూద్దాం"

"తలపై నెలవంకను ధరించిన స్వామి ఎవరో ఆ స్వామి పేరు శివా శివా అని తలచిన వారికి దుఃఖము కలగదు అని. కాని వారు కూడా ఇతరుల కష్టములను చూసి చలించిపోతారు. అదేదో ఆ కష్టము వారికి వచ్చింది అన్నట్లుగా" "సరిగ్గా చెప్పావు. అందులో నువ్వు ఒకటి గమనించావా?" "దేని గురించి? నాకు తెలియదు. "ఇక్కడ తరుణేందు మౌళీ" అని అంటున్నాడు. అది మన చంద్రమౌళీశ్వరుడే. వారి గురువు అయిన బోధేంద్ర సరస్వతి పూజించిన చంద్రమౌళీశ్వరుని పైనే ఇలా కీర్తించాడు" అని చెప్పి స్వామివారు తాదాత్మ్యం చెందారు. నేను స్వామివారికి ఒక విషయం చెప్పదలచుకున్నాను. అది చెప్పి ఉంటే అది అపచారము అయ్యి ఉండేదేమో. అందుకే ఇక్కడ చెబుతున్నాను. వేరొకరి బాధలకు చలించిపోయే మహామనిషి పుట్టబోతున్నాడని మూడువంద యాభై సంవత్సరాల క్రితమే శ్రీధర అయ్యావాళ్ చంద్రమౌళీశ్వరునికి చెప్పుకున్నాడు.



(వి. విశ్వనాధ ఆత్రేయన్, మహా పెరియవళ్ – దరిశన అనుభవంగళ్ నుండి)

గురుచంద్రుల లీలా విశేషాలు ఎన్ని చెప్పుకుంటే ఈ జిహ్వాకు తృప్తి? పెద్దలంటారు – "ఎన్ని జన్మల సుకృతమో కదా సద్గ్రంధ పఠనం, సత్పురుషుల సేవనం" అని. క్షమించాలి అతిశయోక్తి కాకపోతే మన సుకృతమా? అని సందేహం. అపార కరుణావరుణుడైన సద్గురు చంద్రుని ప్రేమామృతం – వారి చెంతన చేరడం, పరమాచార్యుల వంటి మహితాత్ముని ఊసును తలపోయడం. నిజానికి వారి చరిత్రను అధ్యయనం చేస్తుంటే మద్గురు దేవులు శరశ్చంద్రుల దైవీస్థితి – మాకై వారు పడ్డ తపన, మమ్ములను కన్నబిడ్డల్లా వారు ఆదరించిన తీరు, అతి చిన్న విషయాలు – 'అబద్దం చెప్పకూడదు' వంటి విషయాల నుంచి 'మానసపూజ' వరకు ప్రతీ అంశంలోనూ వారు మా చేయిపట్టి నడిపించిన తీరు – దిగివచ్చిన దైవత్వమే – మాతో సంచరించిన మాతృత్వమా? అన్న ప్రశ్న మా మానసాన్ని ఆనందాతిరేకానికి గురిచేస్తూ సద్గురుపథంలో మమ్ములను ఇంకా సుస్థిరుల్ని చేస్తుంది. **మా గురుదేవుల పట్ల మా ప్రేమ లవలేశం – వారి కరుణ ఆకాశం. మాతృత్వపు మధురిమ 'మానవత్వం'గా మమ్ములను కాపాడే సమయంలో 'దివ్యత్వం'గా కలగలిసి మా జీవితాలు ప్రేమవనాలుగా, ఆనందనదాలుగా, వారిని కీర్తించే కవనాలుగా శోభిల్లుతున్నాయి. మా దరహాసం వారి ఆశీఃపవనం. మా జీవితాలు వారు తోట'మాలి'గా పూయించిన నందనవనం. తీసేసిన ప్రతి కలుపు వారి అనుగ్రహం – మిగిలిన ప్రతీ కలుపుకు కారణం మాలో అడ్డుపడుతున్న అహం.** బంటురీతిగా సాయి పదాల చెంత మమ్ము చేర్చి, మా అందరికీ సాయి అభయమనే ముద్రబిళ్ళను ప్రసాదించి మా అందరి జీవితాలను శోభాయమానంగా మార్చాలన్న మహోన్నత ఆశయం వారిది. సౌఖ్యం చిక్కాక మిమ్ములను ఆశ్రయిస్తామని – కోర్కెల కడలిలో ఇంకా ఇంకా... అంటూ దాటవేసే ధోరణి మాది. ఈ లీలా 'వినోదం'లో ఒక్కడుగు మాదైతే బిడ్డ తప్పటడుగులు తన్మయంలో పది అడుగులు తాను వేసి ఎప్పుడెప్పుడు మమ్ము గమ్యం చేరుద్దామా అన్న తల్లి ప్రేమ వారిది. ఆ సద్గురు చంద్రుల దివ్యత్వపు 'శోభ'లో పరిమళించిన మానవతా సౌరభంతో 'విజయం' దిశగా ఒక్కడుగు వేసేందుకు సద్గురు పదాలను ప్రార్థిద్దాము... సద్గురు చరణం... శరణం... శుభం భవతు.

**– గురుకృప**

( 2 పేజీ తరువాయి)



ఈ కేటాయింపు ఎట్లా జరిగిందనంటే ఆయనకు,
మనకు ఉండేటువంటి ఋణానుబంధం.

దీనిని గుర్తు పెట్టుకోండి. ఋణానుబంధం ఉంది గనుక.
అట్లా మనం ప్రక్కన వాళ్ళని నమ్మగలమా?
ఆయనెందుకు చేస్తాడండి మనకు?
మనకు - ఆయనకు ఏమిటి సంబంధం?
ఏం కన్నబిడ్డా? అనంటాం.
వాళ్ళోళ్ల బంధువా?
రక్తసంబంధమా ఏమన్నా అని అంటాం.

కాబట్టి ఏదో ఒక సంబంధముండాలి.
ఈ సంబంధం ఉన్నదనంటే
ఒక సెక్యూరిటీ ఏర్పడుతుంది మనకు.



ఈ ఋణానుబంధాన్ని విశ్వసించడమంటే ఉద్దేశ్యమేంటి?
బాబా దగ్గరకు మనము వచ్చామనంటే ఆయనకు-మనకు ఉండేటువంటి ఏదో సంబంధం, పూర్వజన్మ సంబంధం వల్ల వచ్చాం. మనమిక్కడికి అని ఆయనే చెప్పారు.

కాబట్టి మనలను ఉద్ధరించడం అనేటువంటిది
మన కోరికలు తీర్చడం అనేటువంటిది ఆయన బాధ్యత.
ఆయన Obligation అది.
ఆయనకు తప్పదు అది ఆయన బాధ్యత.
ఆయన బాధ్యత ఎప్పుడైతే అయిందో
ఆయన మనవాడు అనే భావం కలుగుతుంది.

- శ్రీబాబూజీ

అనుగ్రహం ప్రయత్నాలన్నింటికీ అతీతమైనది. అది దిగిరాదలచుకుంటే నీ ప్రయత్నాన్ని స్వీకరిస్తుంది తప్ప నీవు ప్రయత్నించినప్పుడల్లా అది దిగి రావాలని లేదు. అందుకే ప్రయత్నం మానరాదు. ప్రయత్నం చేయాలి. -గురుకృప

సద్గురువు నీకొకసారి లభించాక, నీ బాధ్యత ఆయన స్వీకరించారని తెలిసాక నీకు కష్టాలెదురైనా ఆయన ఉన్నారనే భావన నీకు అభయాన్నిస్తుంది. అందువలన నీలోని తపన, నీవు పడే బాధ పూర్వం వలె అనుభవంకాక నీ అనుభవంలో మార్పు వస్తుంది. నీ కోరికలు, సంతోష విషాదానుభూతులలో మార్పు కనిపిస్తుంది. సద్గురువు (అవే) యొక్క ఆ అభయం లభించేదాకా కోరికలు పెరుగుతూ నిన్ను అనంతంగా బాధిస్తాయి. ఆయన లభించిన తర్వాత నీ కోరికల స్వరూపమే మారిపోతుంది. నీకు కోరికలు ఉంటాయి కానీ అవి ఆయన ద్వారా తీరుతుంటాయి. సమయమాసన్నమయినప్పుడు ఆ కోరికలు నీ ప్రేమను వ్యక్తీకరించేవిగా రూపుదిద్దుకుంటాయి.

- శరశ్చంద్రికలు 2011 జనవరి





మనకు బాబా ఉన్నారు. ఇంక దుఃఖానికి తావేది? కలత చెందడానికేమున్నది? జీవితాన్ని సంతోషంగా అనుభవిద్దాం... ఆస్వాదిద్దాం.. నృత్యం చేద్దాం... ఆనందంగా నృత్యం చేద్దాం. -శ్రీబాబూజీ